# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 07-1-2022 ₹ 15/-








# విద్వేష కుంపటిలో ఓట్ల వంటలు

# గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక : 1 హైదరాబాద్
శుక్రవారం 7 జనవరి 2022 రూ.15-00
3 జమాదివుల్ ఆఖిర్ 1443 హిజ్రీ


**తొలిగీటు**

వచ్చి పడిన ఆపదల విషయంలోనూ, ఇంకా రాని ఆపదల విషయంలోనూ దుఆ లాభదాయకమవుతుంది. కనుక ఓ దైవదాసులారా! దుఆ చేస్తూ ఉండండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్

అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్


సబ్ ఎడిటర్
యాఖూబ్ షర్ఫీ

గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015

సేల్స్ మేనేజర్
ముహమ్మద్ యాసీన్, 9700255736

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


26

## లోపల...


| | | |
|---|---|---|
| వివక్ష | ...... | 04 |
| విద్వేష కుంపటిలో ఓట్ల వంటలు | ...... | 05 |
| యుద్ధం ఇతర మతాలలో – 14 | ...... | 09 |
| సంతాన పట్ల వివక్ష చూపుతున్నారా? | ...... | 12 |
| అశ్లీల ప్రవాహాన్ని అడ్డుకునేదెలా? | ...... | 14 |
| జీవిత లక్ష్యం | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్మాయీల్ – త్యాగానికీ విధేయతకూ ప్రతీక-5 | ...... | 20 |
| చలికాలంలో నమాజులు | ...... | 22 |
| చదువుతోనే నైపుణ్యాభివృద్ధి | ...... | 24 |
| చరితార్థులు-షౌకత్ ఉస్మాని | ...... | 28 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| కాలంనాడి పట్టుకోండి | ...... | 34 |


**పుస్తకాలు చదవండి...**




(హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ)

దేంజరంట వినండి
డిజిటల్‌గా రీడింగు
ఫిజికల్‌గా చదూదే
మేధస్సుకు ఫీడింగు!
రమణగారి మాటల్లో
ఉందటలే మీనింగు
ఆచరిస్తె కల్గుతుంది
ఆనందపు ఫీలింగు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# వివక్ష

ఉత్తరాఖండ్ రాష్ట్రం ఇటీవల వార్తల్లో ప్రముఖంగా కనిపిస్తోంది. హరిద్వార్‌లో జరిగిన ధర్మసంసద్ లో విద్వేష ప్రసంగాలు, హింసా మారణకాండలకు పిలుపుల వార్తలు, వాటిపై నిరసనలు, విమర్శలు, అంతర్జాతీయ మీడియాలో కూడా వచ్చిన రిపోర్టులు, ప్రధాని మౌనం వీటన్నింటి గురించి చాలా మంది రాశారు.

ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన మరో వార్త కూడా గమనించదగింది. చంపావత్ జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు బ్రాహ్మణ స్త్రీ చేతితో చేసిన వంట తినడానికి నిరాకరించారు. అలా ఎందుకు చేశారంటే, అంతకు ముందు సునీతా దేవీ అనే దళిత మహిళ వంట చేసేవారు. ఆమె చేతి వంట తినడానికి అగ్రవర్ణాల విద్యార్థులు నిరాకరించారు. అందువల్ల జిల్లా విద్యాధికారి సునీతాదేవీని ఉద్యోగం నుంచి తొలగించి, ఆమె స్థానంలో బ్రాహ్మణ స్త్రీ పుష్ప భట్‌ను నియమించారు. దీనికి నిరసనగా దళిత విద్యార్థులు ఇప్పుడు ఈమె చేతి వంట తినేది లేదన్నారు.

భారత రాజ్యంగం అధికరణ 17 ప్రకారం అంటరానితనం నిషిద్ధం. శిక్షించదగిన నేరం కూడాను. కాబట్టి దళిత విద్యార్థులకు న్యాయపరమైన పరిష్కారం కోసం ప్రయత్నించే అవకాశం ఉన్నప్పటికీ వారు ఆ పని చేయకుండా, తాము కూడా బాయ్ కాట్ అస్త్రం ఎదురుదాడిగా ప్రయోగించారు. అన్యాయాన్ని, అణిచివేతను ఎదిరించడానికి ఇప్పుడు కొత్త వ్యూహాలు రూపొందుతున్నాయా?

అంటరానితనం శిక్షించదగిన నేరంగా చట్టాలు చేసుకున్నప్పటికీ ఇంకా సమాజంలో కొనసాగుతుందన్నది చేదు వాస్తవం. ఉత్తరాఖండ్‌లో సునీతా దేవి వంటి చెదురుమదురు సంఘటనలు ఎక్కడో జరగవచ్చని అనుకుంటే పొరబాటు. ఇలాంటి సంఘటనలు తరచూ ముందుకు వస్తూనే ఉన్నాయి. చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన పరిష్కారాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదా? ఎందువల్ల అలా జరుగుతోంది? మొదలైన ప్రశ్నలపై ఆలోచించవలసిన అవసరం ఉంది.

అంటరానితనం అనేది వ్యక్తిగత జీవితాల్లోను, సామూహిక జీవితాల్లోను ఉంది. సామూహిక జీవితంలో చట్టబద్ధమైన చర్యల ద్వారా అరికట్టవచ్చు. అంటే స్కూళ్ళలో, కార్యాలయాల్లో, ఆసుపత్రులు వగైరా సామూహిక ప్రదేశాల్లో అంటరానితనాన్ని అరికట్టడం ప్రభుత్వాలకు సులువు. చట్టాలను అమలు చేసి సాధించవచ్చు. కాని వ్యక్తిగత జీవితాల్లో, కుటుంబాల్లో, భావజాలాల్లో వేళ్ళూనుకున్న అంటరానితనాన్ని తొలగించడం చట్టాల వల్ల కాని, ప్రభుత్వాల వల్ల కాని సాధ్యం కాదు. ఎందుకంటే, పోలీసులు, న్యాయస్థానాలు ఇవేవీ కూడా వ్యక్తిగత జీవితాల్లోకి, కుటుంబ జీవితాల్లోకి ప్రవేశించవు. ఉత్తరాఖండ్‌లో ఏం జరిగిందన్నది ఒకసారి చూద్దాం. అగ్రవర్ణ విద్యార్థులు దళిత స్త్రీ చేతి వంట తినడానికి మొదట నిరాకరించారు. ఎందువల్ల? ఎందుకంటే, ఆయా కుటుంబాల్లోని భావజాలం, వారు పెరుగుతున్న వాతావరణంలోని భావజాలం వారిని అలా ప్రేరేపించింది. స్కూలులో కూడా అలానే వ్యవహరించారు. స్కూలులో అలా చేయడం సాధ్యం కాదని చట్టాన్ని అమలు చేయవచ్చు. కాని దానివల్ల కుటుంబాల్లోను, వ్యక్తిగత జీవితాల్లోను, పిల్లలు పెరుగుతున్న సామాజిక వాతావరణంలోను ఉన్న భావజాలం మారుతుందా?

ఇప్పుడు దళిత విద్యార్థులు బహిష్కరించడం అనేది కొత్త వ్యూహం ఏమీ కాదు. గతంలోను ఉత్తరప్రదేశ్, అవధ్, పూర్వాంచల్ ప్రాంతాల్లో దళిత ఉద్యమాల్లో దళితులు అగ్రవర్ణాలతో కలిసి భోంచేయడానికి నిరాకరించి తమ నిరసన తెలియజేసిన సంఘటనలున్నాయి. కౌంటర్ బాయ్ కాట్ సామాజిక దృశ్యాన్ని మారుస్తుందా?

సామాజిక ఆలోచనల్లో మార్పు రానంత వరకు ఇది సాధ్యం కాదు. మనుషులంతా సమానులే అనే సూత్రాన్ని అందరూ నమ్మినప్పుడే అది సాధ్యం.

”అరబ్బు వ్యక్తికి అరబ్బేతరునిపై, అరబ్బేతరునికి అరబ్బుపై, తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై ఎలాంటి ఆధిక్యతా లేదు...“ (ప్రవక్త ముహమ్మద్ (స), చివరి హజ్ ప్రసంగం)

అబ్దుల్ వాహెద్




# విద్వేష కుంపటిలో ఓట్ల వంటలు

**ఎన్నికలు** సమీపించినప్పుడు విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఇప్పుడు దేశంలో మామూలై పోయాయి. మరో సారి ఈ తతంగమే ప్రారంభమయ్యింది.

ఢిల్లీలోని ఉత్తరాఖండ్ సదర్ ఎదుట దాదాపు 100 మంది డిసెంబర్ 27వ తేదీన నిరసన ప్రదర్శన చేశారు. హరిద్వార్‌లో జరిగిన ధర్మసంసద్‌లో హింసా, మారణకాండలను రెచ్చగొట్టే ప్రసంగాలను నిరసిస్తూ ఈ ప్రదర్శన జరిగింది. హరిద్వార్ ధర్మసంసద్‌లో విద్వేష ప్రసంగాలు చేసిన యతి నరసింగా నంద్ తదితరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విచిత్రమేమిటంటే, కేవలం అరగంట సమయంలోనే పోలీసులు అక్కడికి చేరుకుని 144 సెక్షన్ అమలులో ఉందని వెంటనే అక్కడి నుంచి వెళ్ళిపోవాలని హెచ్చరించారు. విద్వేష ప్రసంగాలు హరిద్వార్‌లో జరుగుతున్నప్పుడు పోలీసులు ఇంత చురుగ్గా వ్యవహరించలేదు. నిరసన ప్రదర్శనను ఆపడానికి మాత్రం ఆఘమేఘాలపై పరుగెత్తుకు వచ్చారు.

ఈ నిరసన ప్రదర్శన విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు నిర్వహించాయి. ఓ వర్గంపై మారణహోమం సృష్టించాలని పిలుపునిస్తూ హరిద్వార్‌తో పాటు ఇటీవల ఢిల్లీలో హిందూ యువవాహిని నిర్వహించిన కార్యక్రమంలో కూడా పలువురు చేసిన విద్వేష ప్రసంగాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు 76 మంది సుప్రీంకోర్టు లాయర్లు ఆదివారం ఓ లేఖ రాశారు. ఈ

వ్యవహారాన్ని సుమోటోగా పరిగణించాలని సీజేఐని లాయర్లు కోరారు. దేశంలో ఇలాంటి ఘటనలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని, విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టాల్సిన అవసరముందని ఆ లేఖలో లాయర్లు పేర్కొన్నారు. పట్నా హైకోర్టు మాజీ జడ్జి అంజునా ప్రకాశ్తో పాటు న్యాయవాదులు దుశ్యంత్ దవే, ప్రశాంత్ భూషణ్, బృందా గ్రోవర్, మీనాక్షి అరోరా, సల్మాన్ ఖుర్షీద్ తదితరులు లేఖపై సంతకం చేశారు.

ప్రతిపక్ష నేతలు కూడా ఈ సంఘటనలను తీవ్రంగా నిరసించారు. కాంగ్రెసు నాయకుడు మల్లికార్జున్ ఖర్గే హరిద్వార్ ప్రసంగాలను తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనపై ప్రధాని మౌనాన్ని మరో కాంగ్రేసు అగ్రనేత పి. చిదంబరం ప్రశ్నించారు.

హరిద్వార్‌లో ఈ ధర్మసంసద్ డిసెంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు జరిగింది. ఈ విద్వేష ప్రసంగాల వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మయన్మార్‌లో చూసిన మాదిరిగా ఇక్కడ హిందువులు ఆయుధాలు చేపట్టాలని, ప్రక్షాళన మొదలెట్టాలని ఈ వీడియోల్లో నాయకులు రెచ్చగొడుతున్న ప్రసంగాలున్నాయి. చివరకు ఉత్తరాఖండ్ పోలీసులు ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జితేందర్ నారాయణ్ త్యాగి అనే వ్యక్తిపై కేసు నమోదయ్యింది. ఈయనెవరో కాదు, షియా వక్ఫ్ బోర్డ్ చైర్మనుగా పని చేసిన వివాదాస్పద వసీం రజ్వీ. ఇటీవల ఈయన హిందూ మతం స్వీకరించాడు. కాని అసలు సూత్రధారులైన యతి నరసింగానంద్ సరస్వతి వంటి నేతలపై మాత్రం కేసు లేదు. హరిద్వార్‌లో జరిగిన విద్వేష ప్రసంగాలపై తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి సాకేత్ గోఖలే కూడా ఒక కేసు పెట్టారు. కాని, మరో ధర్మ సంసద్ ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో వెంటనే జరిగింది. అక్కడ కూడా విద్వేష ప్రసంగాలు జరిగాయి. ఏది ఏమైనా దేశవ్యాప్తంగా మతవర్గాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు వండి వార్చుకునే కార్యక్రమం పెద్ద ఎత్తున ప్రారంభమయ్యిందన్నది స్పష్టంగా కనిపిస్తున్న వాస్తవం.

ఈ సంఘటనలు అంతర్జాతీయ మీడియాలో కూడా ప్రముఖంగా కనిపిస్తున్నాయి. భారతదేశంలో ముస్లిం వ్యతిరేక విద్వేష వాతావరణం పెరుగుతోందని పలు అంతర్జాతీయ వార్తాసంస్థలు రిపోర్టు చేస్తున్నాయి. బీజేపీ వైఖరిని కూడా ప్రశ్నిస్తున్నాయి. న్యూయార్క్ టైమ్స్‌లో ధర్మసంసద్ ప్రముఖ వార్తగా వచ్చింది. ఇక్కడి విద్వేష ప్రసంగాల గురించి రాశారు. బాహాటంగా హింసా మారణకాండలకు పిలుపు ఇస్తున్న సంఘటనపై ప్రధాని నరేంద్రమోడీ మౌనం వహించడాన్ని కూడా న్యూయార్క్ టైమ్స్ ఎత్తి చూపించింది.

బిబిసి, అల్ జజీరా, బ్లూమ్ బర్గ్ వార్తాసంస్థలు కూడా ఈ సంఘటనల గురించి రిపోర్టు చేశాయి. ఎన్నికలు సమీపిస్తున్న కాలంలో ఇలాంటి సంఘటనలు మరిన్ని ముందుకు రావచ్చని బ్లూమ్ బర్గ్ రాసింది.

భారత ప్రధాని నరేంద్రమోడీ మంచి వక్త. అనేక వాగ్దానాలు చేస్తుంటారు. హామీలు ఇస్తుంటారు. పథకాలు ప్రకటిస్తుంటారు. ప్రతిపక్ష నేతలపై విమర్శలు కురిపిస్తుంటారు. కాని చాలా సందర్భాల్లో ఆయన మౌనం వహిస్తుంటారు. 2014లో మొదటిసారి ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండేళ్ళు ఆయనేమీ మాట్లాడనే లేదు. వరుసగా మూక హత్యలు జరుగుతున్నప్పటికీ ఆయన నోరు విప్పలేదు. ఉనాలో ఏడుగురు దళితులపై దాడి జరిగిన సంఘటన తర్వాత మాత్రం ఆయన పెదవి విప్పారు. 2017లో న్యూయార్క్ టైమ్స్‌లో ఒక వ్యాసం వచ్చింది. మూకహత్యలను తీవ్రంగా నిరసిస్తూ వచ్చిన వ్యాసం అది. అంతర్జాతీయంగా ఇమేజ్ దెబ్బతినే పరిస్థితి వచ్చినప్పుడు ఆయన నోరు విప్పి నామ మాత్రంగా ఒక మాట చెప్పారు. క్రయిస్తవులపై జరుగుతున్న దాడుల గురించి కూడా న్యూయార్క్ టైమ్స్ ఇటీవల రాసింది. కాని ఈసారి ప్రధాని ఈ సంఘటనలపై మాట్లాడతారా అంటే అనుమానమే. ఎందుకంటే ఎన్నికలు దగ్గరలో ఉన్నాయి.

ఇలాంటి సందర్భాల్లో ప్రధాని మౌనమే తన భాష అంటుంటారు. ముస్లిములపై ఇటీవల కూడా దాడులు పెరిగాయి. ఆయన మాట్లాడలేదు. ధర్మసంసద్‌లో బాహాటంగా హింసోన్మాదం నగ్నంగా నాట్యం చేసింది. కాని ఆయన మాట్లాడలేదు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్, బిజేపీ అధ్యక్షుడు జెపి నడ్డా వంటి నేతలు ముహమ్మద్ అలీ జిన్నా మద్దతుదారులను ఓడిస్తామంటూ రంకెలు వేసినప్పుడు, దేశంలో ముహమ్మద్ అలీ జిన్నా మద్దతుదారులు ఎవరయ్యా అంటూ ప్రశ్నించిన గొంతులు తక్కువ. అప్పుడు కూడా ప్రధాని నోరిప్పలేదు. యోగీ ఆదిత్యనాథ్ స్థాపించిన హిందూ

యువవాహిని సభ్యులు ఢిల్లీలో హిందూరాష్ట్ర స్థాపించడం కోసం చావడానికి, చంపడానికి సిద్ధమంటూ ప్రతిజ్ఞల కార్యక్రమం నిర్వహించినప్పుడు కూడా ఆయన మాట్లాడలేదు. ఇప్పుడివన్నీ దేశంలో సర్వసాధారణమైపోయాయి. ఢిల్లీలో గోలీమారో నినాదాలు ఒక మంత్రి చెప్పించినప్పుడు కూడా ఆయన మాట్లాడలేదు.

ధర్మసంసద్ పేరుతో బాహాటంగా హింసోన్మాదాన్ని రెచ్చగొడుతున్న ప్రసంగాల తర్వాత ప్రధాని మౌనం ఎందుకు వహిస్తున్నారు? అంతర్జాతీయ మీడియాలో తీవ్రమైన విమర్శలు వస్తున్నా, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఉన్నా ఎందుకు మాట్లాడడం లేదు? అనే ప్రశ్నలు ముఖ్యమైనవి. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీకి గడ్డుకాలం కనిపిస్తుంది కాబట్టే ఇవన్నీ జరుగుతున్నాయి. ఈ విద్వేష ప్రసంగాలు చేసిన వారిని ఖండించడం కూడా ఆయనకు కష్టమే. ఎందుకంటే, అందరూ ఒకే గూటి పక్షుల్లా స్పష్టంగా కనిపిస్తున్నారు.

ఇటీవల ప్రధాని చేసిన ప్రసంగాలను గమనిస్తే కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుస్తాయి. డిసెంబర్ 25న కచ్‌లోని లక్‌పత్ గురుద్వారాను ఉద్దేశించి వీడియో లింక్ ద్వారా ప్రధాని ప్రసంగించారు. "శిక్కు గురువు తేజ్ బహదూర్ చేసిన త్యాగం, ఔరంగజేబుకు వ్యతిరేకంగా ఆయన వీరోచిత పోరాటం ద్వారా గుణపాఠాలు గ్రహించాలని, టెర్రరిజాన్ని, మతోన్మాదాన్ని ఎలా ఎదుర్కోవాలో వాటి ద్వారా నేర్చుకోవాలని" అన్నారు. అక్కడ ఆయన శిక్కులను ఉద్దేశించి ప్రసంగించారు. మొగల్ పాలనా కాలంలో శిక్కు గురువుల సంఘర్షణను పలుమార్లు ఆయన ప్రస్తావిస్తారు. కాని విచిత్రంగా వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన శిక్కులను ఉగ్రవాదులుగా బీజేపీ నేతలే ముద్రవేస్తారు. గుర్గాంవ్‌లో ముస్లిముల శుక్రవారం ప్రార్థనలను హిందూత్వ శక్తులు అడ్డుకున్నప్పుడు శిక్కులు తమ గురుద్వారాల్లో ప్రార్థనలు చేసుకోవచ్చని ముందుకొచ్చి ప్రతిపాదించారు. దీనిపై అనేకమంది తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. మధ్యయుగాల్లో జరిగిన సంఘటనలను ఇప్పుడు ఈ రెండు సముదాయాలు గుర్తుంచుకుని శాశ్వత శత్రువుల్లా పోరాడుతూ ఉండాలని కోరుకుంటున్నారా? రెండు సముదాయాలు మైత్రిభావంతో కలిసి ఉండడం ఈ నేతలకు ఇష్టం లేదా? శిక్కు గురువు తేజ్ బహదూర్, ఔరంగజేబ్‌తో పోరాడారన్నది నిజమే. అదేవిధంగా మొదటి శిక్కు గురువు గురుగోవింద్ సింగ్ కూడా హిందూ రాజులపై పోరాడారు. కాని ప్రధాని మోడీ మాత్రం గురు తేజ్ బహదూర్ అప్పట్లో చేసిన పోరాటం గురించి ఇప్పుడు గుర్తు చేసి, అలాగే ఇప్పుడు కూడా రోజూ శిక్కులు పోరాడుతూ ఉండాలని అంటారు. ఎవరితో పోరాడాలి? అనే ప్రశ్నలోనే అసలు కిటుకు ఉంటుంది.

పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనలు జరుగుతున్నప్పుడు ఆయన నిరసనకారులను వారి దుస్తులను బట్టి గుర్తించవచ్చని అన్నారు. కాశీలో కూడా మోడీ చేసిన ప్రసంగం ఇదే మాదిరిగా కనిపిస్తుంది. ఔరంగజేబ్, అహ్మద్ షా అబ్దాలీ, నాదిర్ షా వంటి వారి ప్రమాదం ఇప్పుడు కూడా ఉందని హెచ్చరించారు. విచిత్రమేమంటే దేశసంపదను దోచుకున్న వలసపాలకుల విషయంలో ఎప్పుడు ఆయన నోరెత్తలేదు. శివాజీ, తేజ్ బహదూర్, సుహైద్ దేవ్‌ల మాదిరిగా ఈ ప్రమాదాలపై పోరాడుతూ ఉండాలని ఉద్బోధించారు. ఇప్పుడు ఆలోచించవలసిన విషయమేమిటంటే, ఔరంగజేబ్, అహ్మద్ షా అబ్దాలీ వంటి వారి ప్రమాదం ఇప్పుడు ఎవరి నుంచి ఉంది. ఎవరు పోరాడాలి? ఎవరిపై పోరాడాలి? ఈ ప్రశ్నలకు జవాబులు ఆయన ప్రసంగంలో అంతర్గతంగా దాగి ఉన్నాయి. వాటిని చాలా మంది స్పష్టంగానే అర్థం చేసుకుంటున్నారు. అర్థం కాని వారి కోసం ఈ ధర్మసంసద్‌లలో యతి వంటి వారు బాహాటంగా అర్థమయ్యేలా చెబుతున్నారు. కాబట్టి ధర్మసంసద్ ప్రసంగాలపై ప్రధాని మౌనంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఇదేమీ ఇప్పుడు కొత్తగా ప్రారంభమైనది కాదు. బాబరీ మస్జిద్ కూల్చివేతకు ముందు నుంచి బాబర్ కీ ఔలాదో.. బాబర్ సంతానం అనే మాట ఎవరు చెబుతున్నారు. ఎవరిని ఉద్దేశించి చెబుతు వస్తున్నారు. అనే ప్రశ్నలకు జవాబుల్లో ధర్మసంసద్ విద్వేష ప్రసంగాల వేళ్ళు కూడా కనిపిస్తాయి.

కాబట్టి అర్థం చేసుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. సూరజ్ పాల్ అమూ విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలు చేశాడు. బీజేపీ రాష్ట్ర విభాగం ప్రతినిధిగా ఆయన్ను నియమించారు. దాద్రిలో అక్లాక్ హత్యాకాండ తర్వాత కేసు నడిచింది. నిందితుల్లో ఒకడు చనిపోయాడు. మంత్రి హోదాలో బిజేపీ నాయకుడు మహేష్ శర్మ ఆ నిందితుడిపై జాతీయ జెండా కప్పి గౌరవించాడు. మూకహత్యలో బెయిలుపై బయటకు

వచ్చిన వారిని బీజేపీ నాయకుడు జయంత్ సిన్హా పూల మాలలు వేసి మిఠాయిలు తినిపించి సత్కరించాడు. గోలీమారో నినాదాలు చేయించిన నాయకుడికి కేబినేట్ ర్యాంక్ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్వేష ప్రసంగాలు బాహాటంగా వినిపించడం, పోలీసులు, పాలనా యంత్రాంగం చేతులు కట్టుకుని తమాషా చూడడం వంటి సంఘటనలు జరగడంలో ఆశ్చర్యమేమీ లేదు. సహజంగానే ప్రధాని మోడీ ఏమీ మాట్లాడరు. రోహిత్ వేముల ఆత్మహత్య జరిగినప్పుడు ఆయన మాట్లాడలేదు. జునైద్ హత్య జరిగినప్పుడు ఆయన మాట్లాడలేదు.

విద్వేష ప్రసంగాలు చేసేవారికి బాగా తెలుసు. వారిపై చర్య లేమీ ఉండవన్నది వారికి ఖచ్చితంగా తెలుసు. అందువల్లనే నిర్భయంగా మాట్లాడుతున్నారు. హరిద్వార్‌లో జరిగిన ధర్మసంసద్‌లో యతి నరసింగానంద్, ప్రబోధానంద గిరి, స్వామీ సాగర్ సింధు మహరాజ్ తదితరులు ఉన్నారు. వీళ్ళం దరికి ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీతో చాలా దగ్గరి సంబంధాలున్నాయన్నది రహస్యమేమీ కాదు. ఈ ధర్మ సంసద్‌లో కొందరు బీజేపీ నేతలు కూడా పాల్గొన్నారని వార్త. ధర్మసంసద్ మళ్ళీ మళ్ళీ జరుగుతాయి. ఇలాంటి ప్రసంగాలు మళ్ళీ మళ్ళీ జరగొచ్చు. జనవరిలో బృందావన్‌లో మరో ధర్మ సంసద్ నిర్వహిస్తామని చెప్పారు కూడా.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా యోగీ ఆదిత్యనాథ్ వైఫల్యా లను కప్పిపుచ్చడానికి, ఉత్తరప్రదేశ్‌లో గెలవడానికి ఇలాంటి మతతత్వ ఎత్తుగడలే ఉపయోగపడతాయని ఇప్పుడు బీజేపీ భావిస్తుందని విశ్లేషకులంటున్నారు. కోవిడ్ రెండో అల సమయంలో ఉత్తరప్రదేశ్ నదుల్లో శవాలు ప్రవహించాయి. స్మశానాల్లో క్యూలు కనిపించాయి. ప్రజలకు ఇవన్నీ ఇంకా గుర్తున్నాయి. మళ్ళీ ఇప్పుడు ఒమిక్రాన్ ప్రమాదం వస్తోంది. యోగీ సర్కారు సామర్థ్యం గురించి ప్రజల్లో ఎంత నమ్మకం ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. మరోవైపు పెరుగుతున్న ధరలు, పెట్రోలు డీజిలు ధరల పెరుగుదల ఇవన్నీ బీజేపీ ఎదుర్కోలేని సవాళ్ళు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్ళించా లంటే ఇప్పుడు కావలసింది ధర్మసంసద్ లే. మరోవైపు మధురలో బాబరీ మస్జిద్ మాదిరి వివాదాన్ని రాజేయడానికి కూడా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. బాబరీ మస్జిద్ వివాదం తిరుగులేని మెజారిటీని సాధించింది. మధుర వివాదం మరో యాభయ్యేళ్ళు పరిపాలించే అవకాశం ఇస్తుం దని భావిస్తున్నారు.

ఈ మతతత్వ రాజకీయాలు ఎలా ఉంటాయంటే, ఉదాహ రణకు హెూం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ సమాజ్‌వాదీ పార్టీ అధికారంలోకి వచ్చి రామమందిర నిర్మాణాన్ని అడ్డుకో వాలని భావిస్తుందన్నారు. రామమందిర నిర్మాణాన్ని జరగ నివ్వమని సమాజ్‌వాది పార్టీ ఎప్పుడైనా చెప్పిందా? ఎప్పుడూ చెప్పలేదు. కాని అమిత్ షా ప్రసంగం ద్వారా అలాంటి అను మానం ప్రజల్లో వేయడానికి ప్రయత్నించడమే మతతత్వ రాజ కీయం. ఈ ప్రసంగాన్ని నమ్మి రెచ్చిపోయి ఓటు వేసే ప్రజలు తర్వాత భరించేది మతతత్వ ప్రభుత్వాలను.

దేశంలో మతోన్మాద వాతావరణాన్ని సృష్టించి ఎన్నికల ప్రయో జనాల కోసం ఒకవైపు ప్రయత్నాలు ఉధృతంగా జరుగుతుంటే, మరోవైపు ప్రశాంత పరిస్థితులను కాపాడ్డానికి, మతసామ రస్యాన్ని, శాంతియుత సహజీవనాన్ని రక్షించడానికి కూడా ప్రయత్నాలు చిన్నస్థాయిలో అయినా సరే జరుగుతున్నాయి. ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్ సర్వమత సమ్మేళనాలు నిర్వ హించి శాంతియుత వాతావరణం ఏర్పరచడానికి ప్రయత్ని స్తోంది. అలీగఢ్లో జరిగిన ఇలాంటి సమావేశంలో వివిధ మతాల గురువులు, పెద్దలు పాల్గొన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షుడు సలీం ఇంజనీర్, గురుద్వారా మసూదా బాద్‌కు చెందిన జ్ఞాని రభాజోత్ సింగ్, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియాకు చెందిన జై సింగ్ సుమన్, హరే కృష్ణ భక్తి కేంద్రకు చెందిన దీపక్ శర్మ, చర్చ్ ఆఫ్ అసెషన్‌కు చెందిన రెవరెండ్ లారెన్స్ దాస్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో ప్రశాంత పరిస్థితుల కోసం శాంతియుత సహజీవనం కోసం ప్రయ త్నించే వారు చాలా మంది ఉన్నారు. అలాగే హరిద్వార్ విద్వేష ప్రసంగాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు నిరసన ప్రదర్శన చేయడం ద్వారా దేశంలో విద్వే షాన్ని నిరసించే వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని చాటి చెప్పారు.

మతవర్గాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పాటు చేయ డానికి, మతాల మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నించేవారి ఆటలు కట్టించడానికి పౌరసమాజం నడుం కట్టి, అందరూ సమైక్యంగా ప్రయత్నించవలసిన అవసరం ఉంది. ✤




రచన: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మ) | సంక్షిప్తీకరణ, అనువాదం: ఎస్.ఎమ్ మలిక్

## క్రైస్తవ నైతిక తత్వం

ఈ బోధనల మంచిచెబ్బరలు పూర్తిగా అర్థం చేసుకునేందుకు క్రైస్తవంలోని నిజసారాన్ని పూర్తిగా బోధపరచుకోనంతవరకు అది సాధ్యం కాదు.

క్రైస్తవ మతం ఏ రూపంలోనయితే మన వరకు చేరిందో దాన్ని పరిశీలించడం వల్ల తెలిసేదేమిటంటే అది వాస్తవానికి సన్యాసత్వం, వైరాగ్యం, ప్రపంచాన్ని త్యజించే మతం. ఇందులో మానవ నాగరిక జీవితానికి ఎటువంటి ఆచరణా సంవిధానం, ఎటువంటి శాసనాంగం, ఎటువంటి నియమావళి రూపొందించడం జరగలేదు. అది మానవునికి అతని స్వయం, తన కుటుంబం, తన జాతి, తన తోటి మానవులు ఇంకా తన దైవం పట్ల తన పైన తారసిల్లే హక్కులు, బాధ్యతలేవి వాటిని అందజేసే, చెల్లించే విధానమేదీ అన్న విషయాలేవీ తెలుపదు. ఇంకా పరమ ప్రభువు దైవం మానవునికి అందజేసిన భౌతిక సాధనా సంపత్తి, బౌద్ధిక, శారీరక శక్తుల అసలు ఉద్దేశ్యం, లక్ష్యం ఏమిటీ, వాటి ప్రయోజనం ఏమిటి, ఉపయోగం ఏమిటి, మనిషి వీటిని ఎలా ప్రయోగించాలి అన్న విషయాలను సయితం అది సరిగ్గా తెలుపదు. ఆచరణాత్మక జీవితానికి సంబంధించిన ఈ విషయాలను ఆ మతం అసలు స్పర్శించదు కూడా, చర్చించడం బహు దూర విషయం. దాని సకల విషయాల కేంద్రం ఒకే ఒక్క అంశం - మానవుడు ఏ విధంగా "పరలోక రాజ్యం"లో ప్రవేశించాలి? అన్నది. ఇదొక్క ప్రశ్న మాత్రమే క్రైస్తవ నైతికతకు కేంద్రం. 'క్రీస్తు' ఏ బోధనలనయితే ఇచ్చాడో వాటి అసలు ఉద్దేశ్యం ఈ లక్ష్యాన్ని చేరడానికి మానవుల నందరినీ సమాయత్త పరచడం మాత్రమే.

కాని ఒకటి, "పరలోక రాజ్యం"అన్నది క్రైస్తవం దృష్టిలో "ఇహలోక రాజ్యం"లోని పరిణామ క్రమం ఫలం రూపేణ ప్రాప్తమయ్యేది కాదు. అది ఈ రెంటి మధ్య 'విత్తనం'- 'ఫలం' సామ్యం లేదా సంబంధాన్ని అంగీకరించదు. దీనికి భిన్నంగా రెంటి మధ్య వైరుధ్యాన్ని పూర్తిగా భిన్నత్వాన్ని నమ్ముతుంది. దీని దృష్టిలో ఇహలోక రాజ్యం, పరలోక రాజ్యం రెండూ వేర్వేరయిన అంశాలు. రెండూ ఎన్నటికీ ఒకటి కాజాలవు, నిప్పూ నీరూ ఎలాగయితే ఎప్పటికీ ఒక్కటి కాజాలవో అలాగే! ఈ రెంటినీ పరస్పర విరుద్ధమయినవిగా భావించడంచేత సహజంగానే పరలోక రాజ్యాన్ని పొందడానికి అది ఇహలోక రాజ్యంలోని దారులకు భిన్నమయిన దారినే అవలంబిస్తుంది. ఇహలోక రాజ్యంలోని వస్తు సామగ్రికి సంబంధించిన ప్రతి

వస్తు సామగ్రిని అది పరలోక వస్తు సామగ్రి నుండి తొలగించి వేస్తుంది. తొలగించి వేయడమే కాదు, దాని ఉనికిని పరలోక రాజ్యంలో ప్రవేశానికి అడ్డంకిగా భావిస్తుంది. అందువల్లనే క్రైస్తవం మనిషిని అడుగడుగునా తాకీదు చేస్తూ ఉంటుంది, అతను పరలోక రాజ్య ప్రవేశం కోరుతున్నట్లయితే ఇహలోక రాజ్యంలోని వస్తు సామగ్రిని సంపూర్ణంగా పరిత్యజించవలసి ఉంటుంది అని. తాను దాన్ని పరిత్యజించలేకపోయినట్లయితే పరలోక రాజ్యాన్ని ఆశించనూ వద్దు అని హెచ్చరిస్తూ కూడా ఉంటుంది. ఈ మూలాధారంగానే అది మానవ జీవితంలోని సమస్త విభాగాల్లో సన్యాసత్వాన్ని లేదా వైరాగ్యాన్ని బోధిస్తూ ఉంటుంది. మరి మానవుల్ని సభ్యతా సంస్కృతులూ, నాగరికతలకూ దూరంగా తీసుకువెళ్ళి పూర్తిగా సన్యాసిగా చేయ గోరుతుంది. దీని వివరణ కొరకు క్రీస్తు చేసిన కొన్ని ఆదేశాలను ఉటంకించడం సరిపోతుంది:

"- ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు".

*(లూకా: 14: 26)*

"నేను భూమి మీద సమాధానము కలుగజేయ వచ్చితినని మీరు తలంచుచున్నారా? కాదు, భేదమునే కలుగజేయ వచ్చితినని మీతో చెప్పుచున్నాను. ఇప్పటినుండి ఒక ఇంటిలో అయిదుగురు వేరుపడి, ఇద్దరికి విరోధముగా ముగ్గురును, ముగ్గురికి విరోధముగా ఇద్దరును ఉందురు. తండ్రి కుమారునికిని, కుమారుడు తండ్రికిని, తల్లి కుమార్తెకును, కుమార్తె తల్లికిని, అత్త కోడలికిని, కోడలు అత్తకును విరోధులుగా ఉందురని చెప్పెను". *(లూకా : 12: 51- 53)*

ఇంకా, మత్తయి : 10:8-10; లూకా: 12:32,33; మత్తయి : 19: 21 కూడా చూడండి.

"- ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభమని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఇదిగాక ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుటకంటె సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాననెను." *(మత్తయి :19: 23-24)*

ఇంకా (మత్తయి : 16:19) కూడా చూడండి.

ఏసుక్రీస్తు నుడివిన ఈ సూక్తుల వల్ల అతి స్పష్టంగా తేలిన విషయం ఏమిటంటే పరలోక రాజ్యం వైపునకు తోడుకుని పోడానికి మానవాళిని క్రైస్తవం ఏ విధంగా సుశిక్షణ గరపదలిచిందో అది నాగరికత, సంస్కృతీ సభ్యతలతో పూర్తిగా తెగతెంపులపై ఆధారభూతమయి ఉంది. ప్రతి వ్యక్తికి తెలుసు కుటుంబ సంబంధాలు సాంఘిక, నాగరిక జీవితానికి పునాది అని. సమాజంతో మానవుని సంబంధం ప్రథమంగా అతని బంధువుల ద్వారానే ఏర్పడుతుంది. వారి పరస్పర బాంధవ్యం ద్వారానే సమాజం, సముదాయం రూపుదిద్దుకుంటుంది. నిజానికి మానవునికి నైతికంగా అత్యుత్తమ శిక్షణాలయం కూడా ఈ సామాజిక సంబంధమే. కాని 'క్రీస్తు' ప్రప్రథమంగా తన దెబ్బ మూలసూత్రంపైనే వేటు వేస్తున్నాడు. ప్రథమంగా ఆయన సమాజంతో మనిషిని కట్టిపడవేసే బంధుత్వాన్నే త్రెంచివేస్తున్నాడు. ప్రపంచాన్ని వినియోగించుకునేందుకు, దాని వ్యవహారాలలో భాగం పంచుకునేందుకు ప్రథమంగా మనిషిని ఆచరణకు పురికొలిపేది పొట్టనింపుకునే, తనువు కప్పుకునే చింత. కాని 'క్రీస్తు' ఈ తొలి ప్రేరకాన్నే చంపివేయ దలిచారు. తద్వారా మనిషి ఆకాశంలో తిరిగే పక్షులు, అడవి పువ్వుల చెట్ల వంటి జీవితాన్ని ప్రపంచంలో గడపాలని కోరుకుంటున్నారు. మనిషి సుఖ శ్రేయాల కొరకు, వైయక్తిక సామాజిక సాఫల్యం కొరకు ధన సంపదల సంపాదన అనివార్యం. కాని 'క్రీస్తు' దృష్టిలో ఆధ్యాత్మిక వికాసం, పరలోక రాజ్యం కొరకు దాన్ని పరిత్యజించడం అవసరం. ప్రపంచంలో శాంతి, న్యాయాల వ్యవస్థ నెలకొనాలంటే ప్రభుత్వ వ్యవస్థ, చట్టం, న్యాయవ్యవస్థ, శిక్షాస్మృతి ఇత్యాదివి చట్టబద్ధంగా వ్యవస్థీకృతమయి ఉండటంపైన ఆధారభూతమయి ఉంటుంది. కాని 'క్రీస్తు' ప్రకారం, ప్రతీకార న్యాయం, క్రియ, ప్రతిక్రియల ఈ వ్యవస్థ అంతా మూసివేయనంతవరకు పరలోకాన మీ తండ్రి మీ అపరాధాలను మన్నించనే మన్నించడని అంటారు.

ఒక్కమాటలో "క్రీస్తు" దృష్టిలో ధార్మికత అన్నది వాస్తవానికి ప్రపంచాన్ని విడనాడటం. ఎవరయితే ప్రపంచాన్నీ దాని సరంజామాను విడనాడడో, సామూహిక సంబంధాలను త్రెంచుకోడో, ప్రాపంచిక వ్యవహారాలను మానుకోడో, పరిపూర్ణంగా త్యాగం, సన్యాసత్వపు జీవితాన్ని గడపడో అతనికి పరలోక రాజ్యంలో ఎటువంటి చోటు ప్రాప్తం కాదు. మనిషి ఒకే సమయాన రెండు రాజ్యాలలో ప్రవేశం పొందలేడు. ధార్మికతను, ప్రపంచాన్నీ పొందడం అతనికి సాధ్యమయ్యే

విషయం కాదు. "క్రీస్తు" ప్రకారం, "నీవు ఒకేసారి దేవునికీ సంపదకూ సేవ చేయలేవు". ఇవి రెండూ విరుద్ధ విషయాలు. అందువల్ల ఒక దాన్ని కోరుకునేవాడు, రెండవ దాన్ని వదలుకోవలసి ఉంటుంది.

"క్రీస్తు" చేసిన ఈ బోధనల్ని స్వయాన క్రైస్తవ పండితులు ఏ విధంగా వ్యక్తం చేస్తారో తెలుసుకునేందుకు రెవరెండ్ డూమెల్లో (Rev. Dumellow) బైబిల్ సువార్తల వ్యాఖ్యాన గ్రంథంలోని కొన్ని వాక్యాల సంక్లిప్త రూపం ఇక్కడ ఉటంకించడం బహుశా సరిపోతుందని అనుకుంటున్నాము. ఈ వ్యాఖ్యాన గ్రంథం దాదాపు 40 మందికి మించిన క్రైస్తవ పండితులు కలిసి సహకరించుకుని సిద్ధపరచింది. బైబిల్ వ్యాఖ్యానాల్లో అత్యుత్తమ వ్యాఖ్యానంగా పేరు గాంచింది. దీని ఉపోద్ఘాతంలో ఓ ప్రత్యేక వ్యాసం "క్రీస్తు బోధనలు" శీర్షికన ఉంది. అందులో సంక్లిప్తంగా ఇలా ఉంది-

"మానవాళి శీల నిర్మాణం కొరకు క్రీస్తు ఇష్టపడిన విధానం చాలా మటుకు ప్రపంచం ఇష్టపడిన విధానానికి భిన్నమయింది. ఆత్మాభిమానానికి బదులు లొంగుబాటు, తన హక్కుల కొరకు స్థైర్యం కనబరచడానికి బదులు చెడు సమక్షంలో తలవంచి వెయ్యడం, కోరికలో విస్తృతికి బదులు సంతుష్టి, సౌజన్యత, వినమ్రత, సహనం, సానుభూతి, ఆపదల్లోనూ సంతోషం కనబరుచుట, బాధ వల్ల ఆనందం పొందుట- ఇవీ ప్రపంచానికి క్రైస్తవం అనుగ్రహాలు.. కాని ఒక క్రైస్తవుని శీల స్వభావాల అన్నింటికంటే సమగ్రమయిన నిర్వచనం బహుశా ఏమిటంటే అతను ఏకాగ్రచిత్తుడయిన వ్యక్తి అయి ఉంటాడు. అతను ఓ కాలు ప్రపంచంలోనూ మరో కాలు మతం (చర్చి)లో పెట్టి జీవించలేడు. అతను ఒకే సమయాన దైవం, ప్రపంచం- రెంటి సేవలూ ఒనర్చలేడు... క్రీస్తు దృష్టిలో ప్రపంచంలో మానవుణ్ణి దాని సేవకు బలవంతపెట్టే అతి పెద్ద సాధనం ధన సంపదలు. అందువల్ల ఒక క్రైస్తవుడవటానికి అన్నింటికంటే ప్రథమమయిన తప్పనిసరి నిబంధన మనిషి సంపదలతో సంబంధాన్ని దూరం చేసుకోవాలి."★

★ Commentory on the Holy Bible, Dumellow, p. LXXX)



# ఉస్మాన్ తాహా...

ఉస్మాన్ తాహా... అంతర్జాతీయ గుర్తింపు పొందిన అరబిక్ క్యాలీగ్రాఫర్. సిరియాకు చెందిన తాహా గత 35 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటూ ఖుర్ఆన్ గ్రంథానికి సేవ చేసినందుకుగాను అక్కడి ప్రభుత్వం అతనికి సౌదీ పౌరసత్వంతో సత్కరించింది. తాహా అందమైన చేతిరాత క్యాలీగ్రఫీ డిజైన్లో రాసే ఖుర్ఆన్ గ్రంథాన్ని అక్కడి ప్రభుత్వం ప్రచురిస్తుంది. మక్కాలో హజ్

ఈ ఖుర్ఆన్ ప్రతిని అందిస్తుంది. గత 35ఏళ్లుగా
కి సేవ చేసి నందులకు గాను మదీనా గవర్నర్
వెళ్లి మరీ పౌరసత్వ ధృవపత్రాలను ఉస్మాన్
ంచారు. ఉస్మాన్ తాహా 1970లో సౌదీ
కింగ్ ఫహద్ ప్రింటింగ్ కాంప్లెక్స్లో క్యాలీగ్రాఫర్గా చేరారు. అప్పటి నుంచి తన అందమైన చేతి రాతతో ఖుర్ఆన్ ప్రతులను రాస్తున్నారు. తాహా క్యాలీగ్రఫీలో అంతర్జాతీయ గుర్తింపును సాధించారు. ఎన్నో అవార్డులను సొంతంచేసుకున్నారు. ఇప్పటి వరకూ 200 మిలియన్ల క్యాలీగ్రఫీ ఖుర్ఆన్ ప్రతులు పంపిణీ అయ్యాయి. ✤




# సంతానం పట్ల వివక్ష చూపుతున్నారా?

**తల్లి** ఒడి మొదటి బడి ఊరకే అనలేదు. తల్లి ఒడిలో ఏమి నేర్చుకుంటారో జీవితాంతం అదే అలవర్చుకుంటారు. అమ్మ బడిలో నేర్చుకునేదే జీవితాంతం ఉంటుంది. ఆ బడి మంచిదైతే పిల్లలు వృద్ధిలోకి వస్తారు. ప్రయోజకులవుతారు. తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెడతారు.

పిల్లల శిక్షణ మూడు దశల్లో జరుగుతుంది. ఇంట్లో మొదటి దశ శిక్షణ జరిగితే బడిలో రెండో దశ, సమాజంలో మూడో దశ శిక్షణ జరుగుతుంది. రెండేళ్లు దాటిన పిల్లలు అప్పుడప్పుడే మాట లాడటానికి ప్రయత్నిస్తుంటారు. వచ్చీరాని మాటలతో పిల్లలు పలికే ముద్దు ముద్దు మాటలతో ఇంట్లో వాళ్లంతా మురిసి పోతారు. ఇప్పటిదాకా పరోక్ష శిక్షణ జరిగితే ఇక్కడినుంచి ప్రత్యక్ష శిక్షణ మొదలవుతుంది. పిల్లలు చుట్టూ జరుగుతున్న ప్రతీ విషయాన్ని ఎంతో పరిశీలిస్తుంటారు. ఏదైతే చూస్తారో వాటినే తమ నోటిద్వారా చెప్పేందుకు, పలికేందుకు ప్రయత్నిస్తుంటారు. పాలు తాగే పసిప్రాయం నుంచి ఏదైతే వింటూ వచ్చారో వాటినే పలుకుతారు. ముద్దుమాటలు చెప్పే పిల్లల నోట తిట్లు, దుర్భాషను నేర్పి వాళ్లు అలా మాట్లాడుతుంటే గొప్పగా చెప్పుకునే వారూ లేకపోలేదు. పెరిగిపెద్దయ్యాక పిల్లలు అలానే దుర్భాషలాడి ఇంటి మీదకు గొడవలు తీసుకువచ్చినప్పుడు ఆ తల్లిదండ్రులు తలపట్టుకోవాల్సి వస్తుందన్న విషయాన్ని గమనంలోకి తీసుకోరు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నచందంగా మారుతుంది ఇలాంటి పేరెంట్స్ పరిస్థితి.

ఇంట్లో ఒకరికి మించి ఎక్కువ సంతానముంటే అప్పుడేం చేయాలి?

ఒకరికి మించి ఎక్కువ సంతానం కలిగితే పిల్లల మధ్య సమన్యాయం పాటించాలి. ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలుంటే అందరినీ సరిసమాన దృష్టితో చూడాలి. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అని కాకుండా పిల్లలందరితో నిజాయితీగా వ్యవహరించాలి. అమ్మాయి, అబ్బాయి ఉంటే అమ్మాయి పట్ల వివక్ష చూపడం, అబ్బాయికి ప్రాధాన్యతనివ్వడం ఎక్కువగా చేస్తుంటారు. చాలామంది అమ్మాయిని గవర్నమెంట్ స్కూల్లో, అబ్బాయిని ప్రైవేటు స్కూల్లో చేర్పించడం మొదలు ఇలా ప్రతీ విషయంలోనూ వివక్ష చూపుతుంటారు. ఒకవేళ ఇద్దరు మగపిల్లలుంటే అందంగా ఉన్న పిల్లాడివైపు ఎక్కువగా మొగ్గు చూపడం జరుగుతుంది. పిల్లలు పెద్దల ప్రతీ విషయాన్ని గమనిస్తూ ఉంటారు. పెద్దల వ్యవహారశైలి పిల్లలపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. పిల్లల పట్ల వివక్ష చూపడం, ఒకరిని ఎక్కువ, ఒకరిని తక్కువ చూసి చూడడం ఇస్లామ్ ధర్మం అనుమతించదు. ఇలాంటి పిల్లల మధ్య అసూయ, ద్వేషాలు పెరుగుతాయి. ఇలాంటి పిల్లల్లో సరైన శిక్షణ జరగదు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే వాళ్లందరినీ సమదృష్టితో చూడాలన్నది ప్రవక్త బోధన. పిల్లల పట్ల భేదభావం చూపరాదన్నది ప్రవక్త ఉద్బోధ.

పిల్లల శిక్షణలో తల్లి పాత్ర అనిర్వచనీయమైనది. పిల్లల బాగోగులు, శిక్షణ బాధ్యత తల్లిపై ఉంది కాబట్టే మహిళలకు సంపాదన, ఇంటి పోషణ బాధ్యతల నుంచి ఇస్లామ్ తప్పించింది. పిల్లలు తండ్రికంటే కూడా తల్లినే అనుసరిస్తారు. దీనికి నూహ్ ప్రవక్త కుమారుడే ప్రత్యక్ష నిదర్శనం. నూహ్ ప్రవక్త భార్య ఇస్లామ్ స్వీకరించలేదు కాబట్టి కుమారుడు కూడా ఇస్లామ్ స్వీకరించలేదు. పిల్లలకు ఏమైనా కావాలన్నా ముందు తల్లికే చెప్పుకుంటారు.

తండ్రికి చెప్పాలన్నా తల్లితోనే చెప్పిస్తారు. అందుకే పిల్లల పెంపకం, వాళ్ల శిక్షణ విషయంలో తల్లిపాత్ర ఎంతో కీలకమైనది. పిల్లల పెంపకం విషయంలో తల్లిని ప్రశ్నించడం జరుగుతుందని, సరైన పెంపకంలో పెంచని తల్లులు స్వర్గ సువాసనలను కూడా ఆస్వాదించలేరన్నది ప్రవక్త హెచ్చరిక.

చరిత్రలో ఆదర్శ మాతృమూర్తుల గాథలు ఎన్నో ఉన్నాయి. ఇస్మాయీల్ (అలై) తన తల్లి హజ్రత్ హాజిరా (అలై) శిక్షణ గురించి మనందరం చదువుకున్నాము. తల్లి హాజిరా ఎంతటి దైవ విధేయురాలో ఇస్మాయీల్ (అలై) కూడా అంతే దైవవిధేయులుగా తర్ఫీదు పొందారు. పిల్లల్ని మితిమీరి గారాబం చేయడం వల్ల పెరిగి పెద్దయ్యాక భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. "పుత్తడి ముద్ద తినిపించినా చేదు చూపుతో చూడండి" అని ఊరకే అనలేదు. పిల్లలకు కావాల్సినవన్నీ సమకూర్చండి కానీ క్రమశిక్షణ విషయంలో రాజీపడకూడదు.

పిల్లలు ఇంటినుంచి బయటకు అడుగు పెట్టాక తండ్రి, గురువులదే బాధ్యత. తండ్రి బయటినుంచి ఇంటికి రాగానే పిల్లలు రోజంతా ఏమేం చేశారో అడిగి తెలుసుకోవాలి. పిల్లల విషయంలో ఏదైనా ఫిర్యాదు వస్తే వాళ్లను సున్నితంగా దండించాలి. వాళ్లను హెచ్చరించాలి. మున్ముందు మరోసారి తప్పుచేయకుండా పిల్లలకు మంచీచెడులు నచ్చచెప్పాలి. నేటి తండ్రులకు హజ్రత్ ఇబ్రాహీం (అలై), లుక్మాన్ (అలై) పెంపకం ఆదర్శప్రాయం. ఖుర్ఆన్ తరచి చూస్తే వాళ్లు తమ పిల్లల పెంపకం ఎలా చేశారో బోధపడుతుంది.

పిల్లల పెంపకంలో మరో కీలక దశ పిల్లలు చదివే బడి. ఇంట్లో పిల్లల్ని ఎంతబాగా క్రమశిక్షణగా పెంచినా బడిలో మంచి వాతావరణం లేకపోతే పిల్లలు గాడితప్పుతారు. ధార్మిక భావాలు నూరిపోసే స్కూళ్లు నేడు చాలా అరుదుగానే ఉన్నాయి. పిల్లలకు స్కూళ్లలో ధార్మిక శిక్షణ లేకపోతే ఆ పిల్లలు పెరిగి పెద్దయ్యాక ఎలా తయారవుతారో మనం నేడు చూస్తున్నాము. పిల్లల స్కూలును ఎంపిక కూడా పిల్లల వ్యక్తిత్వంపై కీలక పాత్ర పోషిస్తుంది.

చాలామంది పేరెంట్స్ తమ పిల్లలు చదువుల్లో ముందుండాలని పిల్లలకు ఒత్తిడికి గురి చూస్తారు. వాళ్ల చదువు కోసమే పాటు పడతారు. పిల్లల్ని ర్యాంకులు తెచ్చిపెట్టే యంత్రాలుగా భావిస్తారు. ధార్మిక విద్యాబుద్ధులను బోధించడంలో నిర్లక్ష్యం చేస్తారు. పిల్లల చదుకోసం లక్షలకు లక్షలు డబ్బులు వెచ్చిస్తారు. కానీ ధార్మిక విద్యకోసం నయాపైసా ఖర్చుపెట్టడానికి కూడా వెనకాడతారు. స్కూళ్లలో ధార్మిక విద్య ఏర్పాటు లేకపోతే పిల్లలకు ప్రత్యేకంగా ధార్మిక విద్యను బోధించడానికి ట్యూషన్‌లు ఏర్పాటు చేయాలి. ఖుర్ఆన్ పఠన విద్యను నేర్పాలి. అరబీలో సరైన ఉచ్చారణతో ఖుర్ఆన్ చదివించే ఏర్పాటు చేయాలి. కలిమాలు, ఇస్లామీయ జీవన సరళిని పిల్లలకు నేర్పాలి.

పిల్లల శిక్షణలో స్నేహితులు కూడా కీలకమే. పిల్లలకు ఎన్ని రకాలుగా ఎన్ని విద్యాబుద్ధులు నేర్పించినా వాళ్ల సాంగత్యం సరిగా లేకపోతే పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. మన పిల్లల ఫ్రెండ్స్ ఎంపిక తల్లిదండ్రులే చేయాలి. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారో వాళ్ల అలవాట్లు ఏమిటో ఓ కన్నేసి ఉంచాలి. పిల్లల స్నేహితులు చెడు అలవాట్లు గలవాళ్లయితే అలాంటి సాంగత్యం నుంచి పిల్లల్ని దూరంగా ఉంచాలి. మనిషి తన స్నేహితుడి ధర్మంపై ఉంటాడని ప్రవక్త చెప్పారు. కనుక మంచి స్నేహితుడిని ఎంపిక చేయాలి.

పిల్లల శిక్షణలో ఆటపాటలు చాలా ప్రముఖమైనవి. పిల్లల్ని ఆటపాటలకు దూరం చేయకూడదు. శిక్షణ పేరుతో అతి పనికిరాదు. అది చేయకు, అది తినకు, అక్కడకు వెళ్లకు ఇలా ప్రతీ విషయంలో వద్దు వద్దు అనీ చెప్పడం మూలాన పిల్లల్లో ప్రతికూల భావాలు ఏర్పడతాయి. ఏమి చేయొద్దో చెప్పినప్పుడు ఏమి చేయాలో కూడా చెప్పాలి. దానివల్ల పిల్లల్లో అనుకూల భావాలు కలుగుతాయి. పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు ఆటలు ఎంతో కీలకమైనవి. పిల్లల్ని ఆటపాటలకు దూరం చేసి గది నాలుగు గోడలలో బంధించడం వల్ల పిల్లల శక్తి సామర్థ్యాలు క్షీణించి పోతాయి. వాళ్లలో ఉత్సాహాన్ని పెంచాలి. సెలవురోజు పిల్లల్ని బాగా ఆడించాలి. ఎంతగా అంటే వాళ్లు అలసిపోయేదాకా. చిట్టి చిట్టి చేతులతో సోషల్ సర్వీసు చేయించాలి, చిన్న చిన్న సహాయాలు చేయించాలి. దీనివల్ల పిల్లల్లో చిన్ననాటి నుంచే సేవాభావం అలవడుతుంది. చిన్నారుల అభిరుచులకు తగ్గట్టుగా వాళ్లకిష్టమైన క్రీడలను నేర్పించాలి. శారీరక పటుత్వాన్ని కలిగించే ఆటలు నేర్పించడం మంచిది. పిల్లల మధ్య పోటీలు పెట్టాలి.

పిల్లలు ఏడేళ్ల ప్రాయానికి రాగానే నమాజుకు తీసుకెళ్లాలి. పదేళ్ల ప్రాయానికి చేరుకున్నాక నమాజు చదవకపోతే దండించాలి. పిల్లల వస్త్రధారణ విషయంలో జాగ్రత్త వహించండి. దైవభీతి, సభ్యతా సంస్కారం ఉట్టిపడే దుస్తులనే పిల్లలకు ధరించాలి. ధైర్యసాహసాలను నూరిపోయండి. పిల్లల్లో గూడుకట్టుకున్న పిరికితనాన్ని దూరం చేయండి. ధైర్యసాహసాలకు మారుపేరైన టిప్పుసుల్తాన్, ఔరంగజేబు తదితర మహా యోధుల గాథలను పిల్లలకు వివరించే ప్రయత్నం చేయాలి.

ఇక పిల్లలకు టీనేజ్ దశ పిల్లల శిక్షణకు చాలా కీలక దశ. పైచదువులు ముగిసిన వెంటనే ఈడొచ్చిన పిల్లలకు పెళ్లి చేయడంలో త్వరపడాలి. నికాహ్ చేయడం వల్ల యువతలో పెచ్చరిల్లే రుగ్మతలకు అడ్డుకట్టవేయవచ్చు. పెళ్లితో మొదలయ్యే పిల్లల శిక్షణ పెళ్లితోనే ముగుస్తుంది. అంతేగాని పిల్లల పెంపకం గుణపాఠం కాకూడదు.

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ



# అశ్లీల ప్రవాహాన్ని అడ్డుకునేదెలా?

**టెక్నాలజీ** ప్రతి ఒక్కరికీ అడుగు దూరంలో ఉన్న నేటి ఆధునికంలో- ప్రింటింగ్ మీడియా కన్నా ఎలక్ట్రానిక్ మీడియా ఎక్కువ ప్రభావంతంగా పని చేస్తుంది అనడంలో సందేహం లేదు. వెబ్‌సైట్లు, బ్లాగర్లు, ఫేస్‌బుక్, ట్విట్టర్, వైబర్, స్కైప్, వాట్స్‌ఆప్‌ల వాడకం పెద్ద ఎత్తున జరుగుతోంది. కొన్ని దేశాలు తిరిగితేగానీ దొరకని లక్షలకు మించిన బ్రాండ్‌ల వివరాలు ఒకే ఒక్క వెబ్ వేదిక మీద అందుబాటులో ఉన్నాయి. ఏ దేశంలో నివశించే వారయినా ఎక్కడి నుండయినా బుక్ చేసుకోవచ్చు. మనిషి తన గది మూలలో కూర్చొని ఏ మూలలోని వ్యక్తితోనయినా మాట్లాడ గలుగుతున్నాడు, చూడగలుగుతున్నాడు, ఒక్క క్లిక్‌తో కొన్ని వందల, వేల మంది వరకు సందేశాన్ని చేరవేయగలుగుతున్నాడు. మంచిని గానీ, చెడును గానీ ప్రచారం కల్పించుకునే ఇంత విస్తృత స్థాయి ఏర్పాటు మానవ చరిత్రలో మునుపెన్నడూ జరగలేదు.

రక్తంలో వేడి, ఆలోచనల్లో వాడి, ప్రవర్తనలో దూకుడు గల యువకులు ఈ నూతన ఆప్స్‌ని ఆశ్రయిస్తున్నారు. ఎంత అలసిసొలసి ఉన్నా కొంతలో కొంత సమయమయినా ఎలక్ట్రానిక్ మీడియా ముందు గడపనిదే రోజు గడవడం లేదు. యువత ఇంటర్నెట్ వాడకాన్ని చూసి అశ్లీల మలినాల్ని అంటించే ప్రయత్నం కొందరు చేస్తుంటే, అసత్య సిద్ధాంతాలను యువత మనో మస్తిష్కాల మీద రుద్దే కుయుక్తి మరికొందరిది. ఒక దేశంలో రోజుకి 100 అశ్లీల వెబ్‌సైట్లు బ్లాక్ చేయబడుతున్నాయి అంటే అశ్లీల ప్రవాహం ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. 'ఇలాంటి సైట్ల వల్ల పిల్లలెంతగా చెడిపోతున్నారో చూడండి' అని అరణ్య రోదన చేసేవాళ్ళు చేస్తున్నా "అవి లేకపోతే మరింత అడ్డదారులు తొక్కుతారంటూ" వెనుకేసుకొచ్చేవారే ఎక్కువగా కనబడుతున్నారు.

అభంశుభం తెలియని చిన్నారుల జీవితాలను పోర్న్ భూతం చిదిమేస్తోంది.. అరచేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ అశ్లీల సైట్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది.. కల్లాకపటం ఎరుగని పిల్లల మనసులో కల్మషం నింపుతోంది.. ఆన్‌లైన్ క్లాసుల కోసం అందించిన సెల్‌ఫోన్ పసి హృదయాలపై నీలిచిత్రాల విషం చిమ్ముతోంది.. పోర్న్ వీక్షణం లేత వయసులోనే వ్యసనంగా మారుతోంది. బిడ్డల బంగారు భవితను నిర్దాక్షిణ్యంగా కాలరాస్తోంది.. ముఖ్యంగా నూనూగు మీసాల ప్రాయం మహమ్మారికి బానిసగా మారుతోంది. ఈ తరుణంలో తల్లిదండ్రులు మరింత బాధ్యతగా మెలగాల్సిన అవసరముందని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.

అంతర్జాలం నేటి తరానికి ఓ వరం. పూర్వతరాల వారు కలలో నయినా ఊహించని అనంత జ్ఞానాన్ని నేటి తరం పిల్లలకు స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్‌లు, పీసీలు అందిస్తున్నాయి. వయోభేదం లేకుండా సమస్త సమాచారాన్ని వారి చిటికెన వేలికి చేరువగా ఉంచుతు న్నాయి. అయితే విజ్ఞానంతోపాటు వికృతాలను కూడా అందు బాటులో ఉంచుతున్నాయి. ఒకప్పుడు 'వాయురిజం'గా (అశ్లీల అంశాలపై ఆకర్షితులవడం, చూసేందుకు లేదా చేసేందుకు ఆసక్తి కనబరచడం) ఉన్న సమస్యను నేటి సాంకేతిక సౌకర్యాలు పెర్వర్షన్ (లైంగిక వైపరీత్యం)గా దిగజార్చేశాయి. కొన్ని నష్టాలు కంటికి కనిపించవు. చాపక్రింద నీరులా చల్లగా వచ్చి కబళిస్తాయి. వీటిని పూర్తిగా నిర్మూలించే పరిస్థితి ఇప్పటికయితే కనిపించడం లేదు. ఏ దేశంలో ఎలాంటి నిషేధాలున్నా అశ్లీల సైట్లను పూర్తిగా లేకుండా చేయడం ప్రస్తుతానికయితే అసాధ్యమనే చెప్పొచ్చు. ముల్లుని ముల్లుతోనే తీయాలన్నట్లు మన పిల్లలు వాడే స్మార్ట్ ఫోన్, పీసీ, ట్యాబ్‌లు ఎందులోనయినా సరే అసభ్యకరమయిన దృశ్యాలు చూడకుండా అడ్డుకునే 'నెట్ మానియా' వంటి యాప్స్‌ను కంట్రోల్ చేసే ప్రయత్నం ఉడతాభక్తిగానయినా చెయ్యకపోతే రేపు తీరిగ్గా కూర్చొని చింతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. 'అనుభవమయితే గానీ తత్వం బోధపడదు' అన్న మాట నిజమే కావచ్చు కానీ, కొన్ని అనుభవాలు జీవితంలో ఒక్కసారే ఎదురవుతాయి. వాటి నుండి నేర్చుకునే గుణపాఠాలు చాలా విలువయినవే అయినా, నేర్చుకోవడానికి మనమూ, మన పిల్లలూ లేకపోవచ్చు. ఇతరుల జీవితాల నుండి కూడా నేర్చుకోవా ల్సిన సత్యాలు చాలానే ఉంటాయి. మచ్చుకో సంఘటనను ఇక్కడ పేర్కొంటున్నాము.

కొన్నేళ్ల క్రితం సంఘటన- తనో కాలేజీ కుర్రాడు. గొప్పింటి బిడ్డ. అయితే బలాదూర్‌గా తిరిగే పిల్లలతో స్నేహం చేసాడు. 'కూసే గాడిద మేసే గాడిదను చెడగొట్టింది' అన్నట్టు- తానూ చెడ్డాడు. అయితే ఈ విషయం వారి కుటుంబ సభ్యులకు తెలీదు. చెడుకి అలవాటు పడ్డ అతను అటువంటి అశ్లీల విషయాలు ఎక్కడ దొరుకుతాయో తెలుసుకొని డబ్బులు చెల్లించి 5 యేండ్ల పాటు ప్రతి వారం ఓ పోస్టు తన ఈ మెయిల్‌కి వచ్చే ఏర్పాటు చేసుకున్నాడు. (ఒక్క భారతదేశంలో అందుబాటులో ఉన్న అశ్లీల వెబ్‌సైట్ల సంఖ్య నాలుగు కోట్లు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు విన్నవించుకుంది) అలా వచ్చే మెయిల్స్‌ని దాదాపు 150 స్నేహితుల మెయిల్స్‌కి ఆటోమేటిక్గా వెళ్ళే ఏర్పాటు చేశాడు. వారి స్నేహితులకు ఒక్క క్షణంలో చేరేది. వారి నుంచి కొన్ని వేల మందికి చేరేది. ఆరు మాసాలు గడిచాయి. అకస్మాత్తుగా ఆ కుర్రాడు మరణించాడు. అయితే అతను ప్రారంభించి వెళ్ళిన ఆ చెడు మాత్రం నేటికీ కొనసాగుతూనే ఉంది. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న ఇంటివారు చలించిపోయారు పాపం! ఎలాగోలా సదరు కంపెనీ అడ్రస్సు తెలుసుకొని వారితో వీటిని ఆపి వేయాల్సిందిగా విన్నవించుకున్నారు. కానీ, అగ్రిమెంట్ ప్రకారం అలా చేయడం కుదరదని, ఒకవేళ అలా చేయాలన్నా సదరు వ్యక్తి పాస్‌వర్డ్ ఉంటే ఏమయినా సాయం చేయగలమని, అన్యదా తమ వల్ల కూడా ఆ ప్రవాహాన్ని ఆపడం సాధ్యం కాదని తేటతెల్లం చేశారు.

చూశారా! వ్యక్తి చచ్చి కాటి మట్టిలో కలిసిపోయినా అతను మొదలు పెట్టి వెళ్ళిన చెడు మాత్రం నేటికీ అతన్ని వెంటాడుతూనే, వేటాడుతూనే ఉంది. మనం మన వాల్ మీద పోస్ట్ చేసిన ఓ విషయాన్ని మనం మరచి పోవచ్చేమోగానీ, షేర్ చేసే వారు దాన్ని- మంచిదయినా, చెడ్డదయినా షేర్ చేస్తూనే ఉంటారు. మన కర్మల పత్రంలో మంచో చెడో నమోదు అవుతూనే ఉంటుంది. అంతిమ దైవప్రవక్త(స) ఇలా హితోపదేశం చేశారు: "ప్రజల్లో కొందరు మంచికి మార్గాలయి ఉంటారు. చెడుని రూపు మాపే వారయి ఉంటారు. మరికొందరు - చెడుకి తలుపులు, తలపులు తెరిచే వారయి ఉంటారు. మంచిని నాశనం చేసేవారయి ఉంటారు. మీరు మాత్రం మంచికి మార్గాలుగా మాత్రమే ఉండండి. చెడుని ఊతమిచ్చేవారిగా మారకండి". (ఇబ్ను మాజా)

సమాచార సాంకేతిక పరిజ్ఞాన సాగర మధనంలో పుట్టిన అంతర్జా లాన్ని మన కోసం వరంగా మార్చుకుంటామో, శాపంగా మిగుల్చు కుంటామో మనమే నిర్ణయించుకోవాలి. మన దేశంలో అంతర్జాల వినిమయం 20 శాతంలోపే ఉందంటున్నా చరవాణి (సెల్‌ఫోన్)ల సంఖ్య నూరు కోట్లకు చేరువవుతోంది. చరవాణుల్లో అంతర్జాల వెసులుబాటు వరదలెత్తుతున్న అశ్లీలానికి కౌమార ప్రాయంలోనే పిల్లల్ని బానిసలుగా మార్చేస్తుంది. మెదళ్ళను కకావికలం చేసి, భవిష్యత్తును అంధకారం చేసి, ఎదిగే సత్తాను హరించి, మనిషిని- సమాజాన్ని ఒక్క తీరుగా ధ్వంసం చేయడంలో అశ్లీలానికి మించింది లేదు. ఎయిడ్స్, క్యాన్సర్ల కన్నా, ఆ మాటకొస్తే అణు ప్రమాద తీవ్రత కన్నా విపత్కరమైన అశ్లీల ప్రభంజనాన్ని ఆపకపోతే జరిగే నష్టం అంతా ఇంతా కాదు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి తగిన చికిత్స ఇవ్వడానికి హాస్పిటల్స్, కేరింగ్ షేరింగ్ కేంద్రాలు ఉన్నాయి. కానీ ఈ అశ్లీల భూతానికి బలవుతున్న బాల్యాన్ని, యువతను కాపాడే ఏ కేంద్రం లేకపోవడం, ఈ దుర్వ్యసనాన్ని మాన్పించే ఏ శిక్షణాలయం లేకపోవడం శోచనీయం.

## బ్రౌజింగ్ వ్యసనం

ప్రస్తుత సమాజంలో యుక్తవయసు పిల్లలు తల్లిదండ్రుల పర్యవేక్షణలో పెరగకపోవడం పలు అనర్థాలకు హేతువుగా నిలుస్తోంది. పిల్లలను చిన్న తరగతుల్లోనే హాస్టళ్లలో చేర్పించడం వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ప్రస్తుత విద్యా విధానంలో ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతి ఇంట్లోనూ స్మార్ట్‌ఫోన్ తప్పనిసరిగా మారింది. ఆన్‌లైన్ క్లాసుల కోసం పిల్లల చేతికి ఫోన్ అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగా బ్రౌజింగ్ వ్యసనంగా మారింది. తల్లిదండ్రులు ఏ మాత్రం అలసత్వం వహించినా అది పిల్లల భవితకు శాపంగా మారే ప్రమాదముంది.

## స్నేహ హస్తం అందించాలి

టీనేజ్ పిల్లలు వయసు ప్రభావంతో సహజసిద్ధంగా వచ్చే శారీరక, మానసిక పరిణామాలను అర్థం చేసుకోలేక తీవ్రమైన అలజడికి గురవుతారు. ఈ దశలో తల్లిదండ్రులు తమ పిల్లలకు అండగా నిలవాలి. వారి సమస్యలను ఓపికగా విని అర్థం చేసుకుని పరిష్కరించేందుకు యత్నించాలి. మాట వినడం లేదని కఠినంగా వ్యవహరించకూడదు. వారి తప్పులను గుర్తించి సున్నితంగా హెచ్చరించాలి. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడం వల్లే పిల్లలు కట్టుదాటుతున్నారు. అశ్లీల చిత్రాలను వీక్షించి విపరీత పోకడలకు అలవాటు పడుతున్నారు. ఉన్నత భవిష్యత్‌ను పణంగా పెట్టి పోర్న్ మహమ్మారి వలలో చిక్కుతున్నారు. ఆన్‌లైన్ మాయలో పడి జీవితాన్ని అంధకారబంధురం చేసుకుంటున్నారు. కారణం లోపించిన పర్యవేక్షణ అనక తప్పదు.

మనిషి జీవిత ప్రభావం పుట్టుక నుంచి గిట్టుట దాకే అనుకోవడానికి వీలు లేదు. కొన్ని సందర్భాలలో మరణానంతర సంఘటనలు కూడా అతని చరిత్రపై సానుకూల, ప్రతికూల ప్రభావాలు చూపుతాయి. కాబట్టి రేపు ప్రళయదినాన సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ మన లెక్కలు మనతో తీసుకోక ముందే మన లెక్కల్ని మనమే సరిచేసుకోవాలి. 'నేటి మన ఆత్మపరిశీలన రేపటి కర్మ పరిశీలనను సులభతరం చేస్తుంది' అన్న ఎరుకతో ముందుకు సాగాలి.

# నా కంటిపాప దూరమయ్యింది!

"నాన్నా! నా క్లాస్‌మేట్‌కు అమ్మానాన్న లేరు. వాళ్ళ అమ్మమ్మ దగ్గర ఉంటుంది. తెగిపోయిన చెప్పులు వేసుకుని వస్తుంది. ఆమెకు చెప్పులు కొనిస్తాను".

"మంచి పనికి ఆలస్యం దేనికి తల్లి అలాగే కానివ్వు, ఇవిగో డబ్బులు"

చిన్నప్పటి నుంచే దయాగుణం కల నా గారాల పట్టి ఇటు ప్రాపంచిక విద్య, అటు ధార్మిక విద్యలో మిన్నగా నిలిచింది. చిన్న నాటి నుంచే ధార్మిక సమావేశాల్లో పాల్గొనంటూ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్‌లో (జిఐఓ) సంస్థ బాధ్యురాలిగా చురుగ్గా పనిచేసేది. కాలచక్రం గిర్రున తిరిగింది. యం.ఫాం పూర్తి అయ్యింది. పెళ్ళి చేసా. కరోనా పుణ్యమా అని సాదాసీదాగా వివాహం జరిగింది.

సంవత్సరం తిరగకుండానే నా చిట్టి తల్లికి పండంటి ఆడబిడ్డ పుట్టింది. చిన్ననాటి నుంచి ఆసుపత్రి అంటే ఏమిటో తెలియని నా చిన్నారి ఒక్కసారిగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంది అంటే ఆసుపత్రికి తీసుకెళ్లాను.

ఒక్కరోజులోనే కోలుకుంది. రెండవ రోజు ఇంటికి తీసుకుని వద్దామని బయలుదేరా. అంతలోనే పిడుగులాంటి వార్త. ఏ తండ్రి వినలేని వార్త. నా బంగారు తల్లి మాట్లాడుతూ మాట్లాడుతూనే అల్లాహ్ సన్నిధికి చేరుకుంది.

"ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవున్"

పెళ్ళైన ఏడాదికే పరలోకానికి పయనమై వెళ్ళి పోవడాన్ని ఏ తండ్రీ జీర్ణించుకోలేడు.

"అయ్యో! ఎలా అయ్యింది.?" అని అందరూ అడుగుతుంటే , ఏమని సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు.

పుట్టింది మొదలు నేటి దాకా అనారోగ్యం అంటే ఏమిటో తెలియని నా చిన్నారి వాళ్ళ అమ్మతో మాట్లాడుతూ మాట్లాడుతూ హఠాత్తుగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయింది. పోతు పోతూ మరో (అమానత్) అప్పగింతగా తన రూపాన్ని మరో చిన్నారి రూపంలో అప్పగించి పోయింది.

ఏడు పదుల వయస్సు గల నాన్నమ్మ, అమ్మమ్మ, తన కన్నా రెట్టింపు వయసు ఉన్న తల్లిదండ్రుల కన్నా ముందుగా నా కంటిపాపను తన సన్నిధికి పిలుచుకున్నాడు అల్లాహ్.

**- షేక్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం**




**అమ్మ** కడుపులో ప్రాణం పోసుకున్న మనిషి జీవితం తొమ్మిది నెలలు. ఈ భూమిపైకి వచ్చాక ఎవరు ఎంత కాలం జీవిస్తారో మనలో ఎవరికీ తెలియదు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినా మనిషి జీవిత గడువు ఎప్పుడు ఎక్కడ ఎలా ముగిసిపోనున్నదో మాత్రం తెలుసుకోలేకపోతున్నాడు. జీవిత గడువు అనే గడియారం ముల్లు ఒక్క క్షణం కూడా ఆగకుండా నిరంతరం ముందుకు సాగిపోతూ ఉంటుంది. కాలంతో పాటు లభించిన జీవిత గడువు ఐస్‌లా కరిగిపోతుంది.

‘ఓ మానవుడా! నీవు భారంగా, బలవంతంగా నీ ప్రభువు వైపునకు వెళుతున్నావు. ఆయనను కలుసుకోబోతున్నావు’ అని హెచ్చరిస్తుంది ఖుర్‌ఆన్. బలహీనావస్థ నుండి పుట్టుకను ప్రారంభించిన వాడూ, మళ్లీ ఆ బలహీనత తరువాత బలాన్ని ప్రసాదించినవాడూ, ఆ బలం తరువాత మళ్లీ బలహీనులుగా, ముసలివారుగా చేసిన వాడూ అల్లాహ్‌యే కదా! ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు. ఆయన అన్నీ తెలిసినవాడు. ప్రతిదానిపై అధికారం కలవాడు. అంటే మనిషి జీవితం పసిప్రాయం, యవ్వనం, ముసలితనం అనే మజిలీలు దాటుకుంటూ మృత్యువు కౌగిట్లోకి ఒదిగి ముగిసిపోతుంది.

ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించాడు, ఆపై రేతస్సుతో, తరువాత నెత్తురు ముద్దతో, ఆ పిదప ఆయన మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తీస్తాడు. తదనంతరం మీరు పూర్తి బలం పుంజుకునే వరకు మిమ్మల్ని పోషిస్తాడు. ఆ పిమ్మట మీరు ముదిమికి చేరుకునే వరకు, మిమ్మల్ని పెంచుతాడు. మీలో కొందరు ముందే పిలువబడతారు. మీరు మీ నిర్ణీత వ్యవధికి చేరి యదార్థం ఏమిటో అర్థం చేసుకోవాలని ఇదంతా చేయబడుతోంది. ఆయనే జీవితాన్ని ఇస్తాడు, ఆయనే మరణాన్నీ ఇస్తాడు. ఆయన ఏ విషయాన్ని గురించి నిర్ణయం చేసినా, అది అయిపోవాలని కేవలం ఒక ఆజ్ఞ జారీ చేస్తాడు, అంతే, అది అయిపోతుంది. (40 : 67-68)

ఇది జీవిత సత్యం. జ్ఞాన వంతుడవైన ఓ మనిషి! ఈ జీవిత సత్యాన్ని గ్రహించి కాలాన్ని అర్థం చేసుకో, జీవితాన్ని స్వార్థకం చేసుకో. నిజ దైవాన్ని గుర్తించి లభించిన ప్రతి క్షణం అమూల్యమైనదిగా భావిస్తూ సద్వినియోగం చేసుకుంటే మనిషిగా లభించిన జీవితానికి ఒక అర్థం ఉంటుంది.

ఒక్కడైన దేవుని ఆదేశాలను బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా జీవిస్తున్న వారిని చూసి మోసపోకండి. ఎన్ని దుర్మార్గాలు చేసినా, అమాయకుల మీద దౌర్జన్యాలు చేసినా, ధర్మాధర్మాలను మరచి తింటూ, తాగుతూ, చిందులు గంతులు వేస్తూ విచ్చలవిడిగా జీవిస్తున్న వారిని దేవుడు ఎందుకు శిక్షించడు? ఎందుకంటే..

మేము వారికి కొంత కాలం ప్రపంచంలో సుఖాలను అనుభవించే అవకాశాన్ని ఇస్తున్నాము, తరువాత వారిని అశక్తులుగా చేసి ఒక కఠోరయాతన వైపునకు లాగుకొనిపోతాము. (31:24)

జీవితం అమూల్యమైనది. అర్థం చేసుకుందాం. లభించిన జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకుందాం. క్షణభంగురమైన ప్రాపంచిక సుఖాల కోసం వెంపర్లాడక, సత్యం కోసం న్యాయం కోసం, ధర్మం కోసం సమాజ హితం కోసం కృషి చేద్దాం.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

75 ఆయత్‌లు

# 39. అజ్ జుమర్

మక్కా అవతరణ

55 – 61 మీ ప్రభువు పంపిన గ్రంథంలోని ఉత్తమ పార్శ్వాన్ని అనుసరించండి,[72] మీరు ఇంకా తెలుసుకోకుండానే మీకు అకస్మాత్తుగా యాతనా శిక్ష దాపురించక ముందే. తరువాత ఏ వ్యక్తి అయినా ఇలా పలికే స్థితి రాకూడదు– "అయ్యయ్యో, అల్లాహ్ సన్నిధానంలో నేను చేసిన అపచారానికి నా పాదుగాను, పైగా నేను ఎగతాళి చేసే వారితో కలసిపోయాను" లేదా ఇలా పలకవలసి రాకూడదు– "అయ్యో, అల్లాహ్ నాకు మార్గ బోధన ప్రసాదించి ఉంటే నేను సయితం నిష్ఠాపరుల్లోని వాడనయి ఉండేవాణ్ణి." లేదా శిక్షా యాతనను చూసి, "అయ్యో, నాకు మరో ఒక్క అవకాశం దొరికితే ఎంత బావుండేది, నేనూ సత్కార్యాలాచరించే వారిలో కలసి పోయేవాణ్ణే!" అనకూడదు. (కాని అప్పుడు అతనికి ఈ సమాధానం లభిస్తుంది) "అది కాదు, నా ఆయత్‌లు నీ వద్దకు వచ్చాయి, వాటిని నీవు అబద్ధీకరించావు, అహంకారం చూపావు, నీవు తిరస్కారుల్లో చేరావు." నేడు దైవం పట్ల అబద్ధాలను ఆపాదించే వారిని నీవు ప్రళయదినాన చూస్తావు, వారి ముఖాలు నల్లబారి ఉంటాయి. నరకంలో దురహంకారులకు తగినంత స్థలం లేదా ఏమీ? దీనికి భిన్నంగా ఇక్కడ నిష్ఠగా గడపిన వారికి వారి సాఫల్య కారణాల వల్ల అల్లాహ్ విమోచనాన్ని ప్రసాదిస్తాడు; వారికి ఎటువంటి హానీ కలగదు, వారు దుఃఖితులూ కారు.

62 – 66 అల్లాహ్ ప్రతి వస్తువునూ సృష్టించినవాడు, మరాయనే ప్రతి వస్తువును కనిపెట్టుకుని ఉన్నాడు.[73] భూమీ ఆకాశాల నిధుల తాళం చెవులు ఆయన అధీనంలోనే ఉన్నాయి. మరెవరయితే అల్లాహ్ ఆయత్‌లను తిరస్కరిస్తారో వారే నష్టంలో పడి ఉండేవారు. (ప్రవక్తా!) వీరికి చెప్పు, "మరయితే మూఢుల్లారా, అల్లాహ్‌ను కాదని మరెవరి దాస్యమో చెయ్యాలని మీరు నాకు చెబుతున్నారా?" (ఈ మాట నీవు వారికి అతి స్పష్టంగా చెప్పివెయ్యాలి, ఎందుకంటే) నీకూ, నీకు ముందు కడచిన ప్రవక్తలందరికీ ఈ వహీ పంపడం జరిగింది. నీవు ఒకవేళ షిర్క్ చేసినట్లయితే నీ ఆచరణ అంతా వృధా పోతుంది[74] మరి నీవు నష్టంలో పడిపోతావు. కాబట్టి (ప్రవక్తా!) నీవు కేవలం అల్లాహ్ దాస్యం మాత్రమే చెయ్యి, కృతజ్ఞులయిన దాసుల్లో కలసిపో.

72. దైవగ్రంథంలోని ఉత్తమ పార్శ్వాన్ని అనుసరించడం అంటే, అల్లాహ్ ఏ ఏ పనులనయితే చేయాలని ఆదేశించాడో మనిషి వాటిని ఆచరించాలి; వేటినయితే ఆయన వారించాడో వాటికి దూరంగా మెలగాలి; ఉపమానాలు, గాథల ద్వారా ఆయన ఉపదేశించిన గుణపాఠం హితవు గ్రహించాలి. దీనికి భిన్నంగా ఎవరయితే ఆదేశాలకు విముఖుడవుతాడో, నిషేధాల ఆచరణకు పాల్పడుతాడో, అల్లాహ్ చేసే బోధనలు, హితవుల ద్వారా ప్రభావాన్ని గ్రహించడో అతను దైవగ్రంథంలోని నికృష్టమయిన పార్శ్వాన్ని అవలంబిస్తాడన్నమాట. అంటే దైవగ్రంథం దేన్నయితే నికృష్టమయినదని నిర్ణయిస్తుందో దాన్ని అనుసరిస్తాడన్నమాట.

73. అంటే, ఈ ప్రపంచాన్ని పుట్టించి వదలిపెట్టలేదు. నిజానికి ఆయనే ప్రతి దాన్నీ గమనిస్తూ కనిపెట్టుకుని ఉన్నాడు. ప్రపంచంలోని సమస్తమూ ఆయన పుట్టించడం వల్ల ఉనికిలోకి వచ్చినట్లే ఆయన మనగలగనివ్వటం మూలానే మనగలుగుతున్నాయి. ఆయన పోషించడం చేతనే పెరుగుతున్నాయి, ఆయన రక్షణ, పర్యవేక్షణలోనే పనులు చేస్తున్నాయి.

74. అంటే, షిర్క్‌తో పాటు చేసే ఏ ఆచరణనయినా సదాచరణగా పరిగణించడం జరగదు. ఏ వ్యక్తి అయితే బహుదైవారాధకుడయి ఉంటూ తన దృష్టిలో అనేక కార్యాలను సత్కార్యాలుగా భావిస్తూ ఆచరిస్తాడో అతను వాటికి ఎటువంటి ప్రతిఫలానికీ అర్హుడు కాడు. అతని జీవితం యావత్తు నష్టకరంగా రూపొందుతుంది.

★★★

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## నీటి పారుదల ప్రకరణం


**560)** జైద్ బిన్ ఖాలిద్ (రజి) కథనం: ఒక వ్యక్తి[1] దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి, 'లుఖ్తా' (దారిలో తనకు దొరికిన వేరొకరి వస్తువు) గురించి ప్రశ్నించాడు. దానికి సమాధానంగా ఆయన (సఅసం) ఇలా అన్నారు: "దాని సంచిని, దాని మూతి కట్టుడును జాగ్రత్తగా పరిశీలించి ఆనవాళ్ళను గుర్తుపెట్టుకో. తరువాత ఒక ఏడాది కాలం వరకూ దానికి సంబంధించి ప్రకటన చేస్తూ ఉండు. ఈ లోగా ఆ వస్తువు యజమాని వస్తే, దానిని అతనికి అప్పగించు. రాకపోతే ఆ వస్తువు నీది". 'ఒకవేళ తప్పిపోయిన మేక అయితే ఏం చేయాలి?' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, "అది నీది లేదా నీ సోదరునిది లేదా తోడేలుది" అని ఆయన (స) సమాధానమిచ్చారు. 'ఒకవేళ తప్పిపోయిన పశువు ఒంటె అయితే...' అని ఆ వ్యక్తి సందేహపడగా, "దాని సంగతి నీకెందుకు? దాహం తీర్చే వస్తువు దానిని వెన్నంటి ఉంది. దాని గూడు ఉంది. తన యజమాని వచ్చి తోలుకుపోయే వరకూ నీరు త్రాగుతూ, ఆకులు, గడ్డి తింటూ ఉంటుంది" అని ఆయన(స) బదులిచ్చారు.

**563)** హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) ఉల్లేఖనం: ప్రవక్త మహనీయుల (సఅసం)తో కలసి బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సందర్భంగా నాకు విజయప్రాప్తిగా ఒక పడుచు ఒంటె లభించింది. మరొక ఒంటెను దైవప్రవక్త(సఅసం) నాకు కానుకగా ఇచ్చారు. ఒకరోజు నేను ఒక అన్సారీ సహాబీ ఇంటి ఆవరణలో ఆ రెండు ఒంటెలను కట్టి ఉంచాను. వాటి వీపులపై 'ఇజ్ఖిర్' (సువాసనతో కూడుకున్న) గడ్డిని మోపి, అమ్ముకుని రావాలన్న ఉద్దేశ్యంతో నేను ఆ ఒంటెలను అక్కడ కట్టి ఉంచాను. ఆ సందర్భంగా బనూ ఖైనుఖా తెగకు చెందిన ఒక కంసాలి కూడా నా వెంట ఉన్నాడు. ఆ విధంగా ఆ గడ్డి అమ్మగా వచ్చిన డబ్బుతో (నేను వివాహమాడబోయే) ఫాతిమా(ర.అ) వలీమా విందు ఏర్పాట్లు చేయాలనుకున్నాను. హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి) ఆ సమయంలో ఆ అన్సార్ సహాబీ ఇంట్లోనే సారాయి త్రాగుతున్నారు. పాటలు పాడే ఒక స్త్రీ కూడా అక్కడ ఉంది. ఆ స్త్రీ పాటపాడుతూ హమ్జా (రజి)ను రెచ్చగొట్టింది. "అయ్యో! అలా చూస్తావేమిటి హమ్జా! లే. బలిసిన ఈ పడుచు ఒంటెల పనిపట్టు" అని ఉసిగొల్పే సరికి హమ్జా (లోని పౌరుషం పురి విప్పింది). ఖడ్గం చేబూని ఆ ఒంటెల వైపు దూసుకుపోయారు. వాటి మూపురాలను కోసేశారు. వాటి డొక్కలు చీల్చి కాలేయాన్ని బయటికి తీశారు (ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు). 'ఏమిటి, మూపురాల మాంసాన్ని కూడా కోశారా?' అని నేను ఇబ్నె షిహాబ్‌ను అడగ్గా, ఆ రెండింటి మూపురాలను కోసుకుని వెళ్ళారు అని ఆయన చెప్పారు. హజ్రత్ అలీ (రజి) ఇలా అన్నారు : ఇది చూసి నాకెంతో బాధ కలిగింది. నేను మారు మాట్లాడకుండా– తిన్నగా– దైవప్రవక్త(సఅసం) దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో జైద్ బిన్ హారిసా (రజి) కూడా అక్కడే ఉన్నారు. హృదయ విదారకమైన ఈ సంఘటనను నేను దైవప్రవక్త(సఅసం)కు వినిపించగానే, ఆయన (సంఘటనా స్థలికి) వచ్చారు. జైద్ బిన్ హారిసా (రజి) కూడా ఆయన (స) వెంట ఉన్నారు. నేను కూడా అక్కడే ఉన్నాను. దైవప్రవక్త(సఅసం) అక్కడకు చేరుకుని తన ఆవేదనను వెల్లడించినపుడు హజ్రత్ హమ్జా(రజి), (మావైపు) దృష్టిని సారించి, 'మీరంతా నా తండ్రీ తాతల దాసులు" అని అన్నారు. అంతే, దైవప్రవక్త(స) అక్కడి నుంచి వెనుతిరిగి వచ్చేశారు. మద్య సేవనం నిషేధించబడక పూర్వం జరిగిన సంఘటన ఇది.[1]"

560-1. ఆ వ్యక్తి పేరు అబూ ఉమైర్ మాలిక్ అని కొందరంటే, బిలాల్ అని మరి కొందరన్నారు. అతని పేరు జైద్ బిన్ ఖాలిద్ అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

563-1. అప్పటికి మద్య సేవనం, గానా బజానాలపై నిషేధాజ్ఞలు రాలేదు. ఆ సమయంలో దైవప్రవక్త(స) పినతండ్రి అయిన హజ్రత్ హమ్జా (రజి) మైకంలో ఉన్నారు. కాబట్టి అలా అన్నందుకు ఆయన పాపాత్ములుగా పరిగణించబడరు. ఆయన పలుకుల్లోని అర్థం ఇది: చూడండి! నేను అబ్దుల్ ముత్తలిబ్ పుత్రుడను. మీరిద్దరూ (ముహమ్మద్-స, అలీ-రజి) నా కొడుకుల్లాంటి వారు, అబ్దుల్ ముత్తలిబ్ పౌత్రులు. నా ముందు మీరు పసికూనల వంటివారు. నన్ను నిలదీసి అడిగే అధికారం మీకెక్కడుంది? తాగిన మత్తులో ఆయన ఇలా వాగారు. అప్పటికి మద్యపానం నిషేధాజ్ఞ అవతరించ లేదు. ఆ సమయంలో వాదనకు దిగితే ప్రయోజనం లేదని భావించి దైవప్రవక్త(స) సంఘటనా స్థలం నుంచి తిరిగి వచ్చేశారు. మత్తు వదిలిన తరువాత, హమ్జాకు, ఆయన వల్ల జరిగిన తప్పేమిటో విశదపరచి, ఆయన నుండి అలీ (రజి)కి నష్టపరిహారం ఇప్పించినట్లు కొన్ని ఉల్లేఖనాలున్నాయి.

'ఇజ్ఖిర్' అనేది సువాసన గల గడ్డి. స్వర్ణకారులు ఆ గడ్డిని విరివిగా ఉపయోగించేవారు. బంజరు భూముల్లో ఉన్న గడ్డిని కోసుకుని వచ్చి అమ్ముకోవటం, తద్వారా వచ్చిన సొమ్ముతో జీవితావసరాలు తీర్చుకోవటం ధర్మసమ్మతం అన్నది ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.




# ఇస్మాయీల్- త్యాగానికీ విధేయతకూ ప్రతీక

**మహనీయ** ఇస్మాయీల్ అలైహిస్సలామ్‌ని ఇస్లామీయ ధార్మిక పారిభాషిక పిలుపులో ''జబీహుల్లాహ్'' అని అంటారు. అంటే దైవం కొరకు 'జిబ్హ్' అవడానికి సిద్ధపడిన వ్యక్తి అన్నమాట. 'జబీహ్' లేదా 'జిబ్హ్'కు సిద్ధపడిన వ్యక్తి అంటే కుత్తుక పైన కత్తి నడిపించి ప్రాణ త్యాగానికి  ఉద్యుక్తుడవడం అన్నమాట! ఈయన మహనీయ ఇబ్రాహీమ్(అ) జేష్ఠ కుమారుడు. మహా త్యాగశీల హాజిరా (అ) తనయుడు. తల్లీ తనయుడు నిర్జన ఎడారిలో ఓ చెట్టు క్రింద, జిబ్రయీల్(అ) తన ప్రక్కలతో కెలికి త్రవ్విన 'జమ్‌జమ్' ఊటబావి చెంతన విడిది తీరిన మహిమాన్వితులు!  అక్కడే వారి ఉనికిపట్టును పురస్కరించుకుని ఓ ప్రముఖ అరబ్బు తెగ 'జుర్‌హుమ్' వారు వచ్చి హాజిరా మాత అనుమతితో నివాస మేర్పరచుకుని 'మక్కా' నగరాన్ని స్థాపించిన ఘనతను దక్కించు కున్నారు!!

## ఇస్మాయీల్ బలిదానం!

మహనీయ ఇబ్రాహీమ్(అ) తన అనుంగు కుమారుడు ఇస్మాయీల్‌ని, తన పత్ని హాజిరాని ఎడారి భూమిలోని లోయలో వదలి వారి పట్ల ఏమరుపాటుకు గురికాలేదు. అప్పుడప్పుడు వచ్చి క్షేమ సమాచారాలు  విచారించడంతోపాటు కొన్నాళ్ళు వారితో కలసి ఉండేవారు కూడా. ఆయన పాలు త్రాగే ఇస్మాయీల్‌ని, అతని తల్లి హాజిరాని ఇక్కడ వదులుతూ దైవాన్ని వేడుకున్నారు, ''ప్రభూ, ఈ నగరాన్ని శాంతి నిలయంగా చెయ్యి'' (14: 35) అని. ఆ ప్రార్థన ప్రకారమే ఆ నిర్జన ప్రదేశం ఓ నగర రూపం దాల్చింది. మహనీయ ఇబ్రాహీమ్(అ) జుర్‌హుమ్ ప్రజల మధ్య సత్యధర్మ ప్రచారమూ మెండుగా చేసి ఉంటారు. ధర్మప్రచారమే జీవితాశయంగా, ఆ ధ్యేయం కొరకే వందల మైళ్ళు రేయనక పగలనక పయనించి ఇరాక్ నుండి దేశ దేశాలు, దైవాదేశం మేరకు తిరుగుతూ అరేబియా ఎడారులు దాటి వచ్చిన ఇబ్రాహీమ్ కొత్తగా వెలసిన ఆ నగరంలో ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాలు కొనసాగించకుండా ఉండరు. అయితే ఆయనకు ఇక్కడ మరో పరీక్ష! దాన్ని దివ్య కుర్‌ఆన్ ఇలా వర్ణించింది :

“ఆ తరువాత ఆ బాలుడు (ఇస్మాయీల్) అతనితో (ఇబ్రాహీమ్‌తో) పాటు, పాటుపడే స్థాయికి ఎదిగినప్పుడు (ఒక రోజు) ఇబ్రాహీమ్ (అతనితో) అన్నాడు, “బాబూ, నేను కలగన్నాను, నేను నిన్ను జిబ్హ్ చేస్తున్నట్లు, ఇక చెప్పు, నీవేమంటావో”. అతనన్నాడు, “నాన్నగారు, మీకు ఆదేశమయిందేదో మీరు ఆచరించండి, ఇన్‌షా అల్లాహ్, మీరు నన్ను సహనశీలునిగానే కనుగొంటారు” అని. కడకు వారిరువురూ విధేయతా శిరస్సు వంచినప్పుడు, ఇబ్రాహీమ్ తనయుని నుదుటి మీద పడవేసినప్పుడు, మేము అతన్ని పిలిచాము, “ఇబ్రాహీమ్! నీవు కలను నిజం చేశావు. మేము సదాచారులకు ఇలాగే సద్ఫలితాన్నిస్తాము. నిశ్చయంగా ఇది ఓ ప్రస్ఫుటమయిన పరీక్షే!” ఆపైన మేము ఓ పెద్ద బలిదానాన్ని పరిహారంగా ఇచ్చి ఆ బాలుని విడిపించుకున్నాము.

(అస్ సాఫ్ఫాత్ : 102-107)

## అది మినా మైదానం!

ఈ సంఘటన మక్కాలో జరిగింది. మహనీయ ఇబ్రాహీమ్ తనయుణ్ణి బలిదానానికి తీసుకువెళ్ళిన స్థలం మక్కాలోని మినా మైదానం. అక్కడికి తీసుకువెళ్ళడానికి కారణం, మక్కా నగరంలో జనావాసం బాగా పెరిగింది. అక్కడ మహనీయ హాజిరా కూడా ఉన్నారు. అందరి సమక్షంలో దైవాదేశం నెరవేర్చడం సాధ్యమయ్యే విషయం కాదు. అప్పటికి ఇస్మాయీల్ వయసు 12, 13 సంవత్సరాలే. ఇంకా మహనీయ ఇస్‌హాక్ జననం జరగలేదు. ఎందుకంటే ఈ సంఘటనను గురించి వివరించిన తరువాతే ఇదే సూరా (అస్ సాఫ్ఫాత్)లో “మేము ఇబ్రాహీమ్‌కు ఇస్‌హాక్ శుభవార్తనిచ్చాము, అతను సజ్జనుడయిన ప్రవక్త.” (112) అనే వాక్యమూ ముందుకు వస్తుంది.

మరో విషయం, ప్రవక్త ఇబ్రాహీమ్ కలలో తనయుని జిబ్హ్ చేసినట్లు చూడలేదు, చేస్తున్నట్లు చూశారు. దాని భావం ఆయన జిబ్హ్ చేయడమనే గ్రహించారు, చిత్తశుద్ధితో చేయాలనే నిర్ణయించుకున్నారు. ప్రవక్త తనయుడయిన ఇస్మాయీల్(అ) సయితం ప్రవక్త కలను వహీ (దైవవాణి)గానే పరిగణించారు. అందువల్లనే మీకు ఆదేశమయిన దాన్ని మీరు ఆచరించండి అని విధేయతా శిరస్సును వినమ్రంగా వంచారు. ఇంకా గమనార్హమయిన అంశం ఏమిటంటే, మహనీయ ఇబ్రాహీమ్, తన కుమారుణ్ణి జిబ్హ్ చెయ్యడానికి బోర్లా పరుండ చేశారు, ముఖం చూసి తండ్రి ప్రేమ వాత్సల్యాల వల్ల చెయ్యి వణకరాదని, చివరి క్షణంలో మనసు మారిపోరాదనీను, ఆయన మానవుడే గనకే. అందువల్ల క్రింద చెయ్యి పెట్టి కుత్తుక కొయ్యాలని కోరుకున్నారు. కాని ఆయన తన సంకల్పం నెరవేర్చేముందే దైవం, “ఇబ్రాహీమ్ నీవు కల నిజం చేశావు” అనడం, కలలో జరిగిన సంఘటన మేర వాస్తవమే. అలా దైవం పెట్టిన పరీక్షలో ఆయన నెగ్గారు. అందుకే దైవ వచనంలో చెప్పడం జరిగింది, మేము మా సద్వర్తనులయిన దాసులకు ఇలాగే సద్ఫలితం అనుగ్రహిస్తామని. అంటే పుత్రుని హత్య తండ్రి చేత చేయించకనే తండ్రి దైవాదేశం మేరకు తనయుణ్ణి బలి చెయ్యగలడనీ, తనయుడు సయితం దైవాదేశాన్ని శిరసావహించి ప్రాణ త్యాగానికీ సిద్ధమవగలడనీ నిరూపించడం జరిగింది!

ఆ ప్రాణత్యాగం ఆ మహా బలిదానాన్ని, మహనీయ ఇస్మాయీల్‌కు పరిహారంగా దైవం పక్షాన ఇవ్వబడిన గొర్రె బలిదానాన్ని, ఇస్మాయీల్ ప్రవక్త(అ) సంతతిలోనే కాదు, ఆయన ద్వారా ప్రపంచంలో ప్రభవించిన చివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) అనుచర సముదాయంలోనూ ఆ సంప్రదాయాన్ని- పశు బలిదానాన్ని- దైవం హజ్జ్ యాత్రలో, ఆనాటినుంచి నేటివరకు- దాదాపు నాలుగు వేల సంవత్సరాల తరబడి ఓ నియమానుబంధంగా, ఆచరణీయంగా, చిరస్మరణీయం చేసివేశాడు! దైవ విధేయతా మార్గంలో, ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీమ్ (అ) మాదిరిగా, చివరి ప్రవక్త పితామహుడు ఇస్మాయీల్(అ) మాదిరిగా దైవాదేశం మేరకు ప్రతి ముస్లిమ్ వ్యక్తి, ప్రతి దైవ విధేయుడు, విధేయతా శిరస్సు వంచేసి, కేవలం తన సర్వస్వమే కాదు అవసరమయితే తన ఇంటిల్లిపాదినీ వదలి తన ప్రాణత్యాగానికయినా వెరువరాదని వారి ఆదర్శ జీవితాలు నేర్పుతున్నాయి!!

**(ఆధారం : సీరతె సర్వరె ఆలమ్ : సం.2, పు. 46-48)**

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**కారుణ్య ప్రభువు** ఈ విశ్వాన్ని అత్యంత వివేకంతో సృష్టించాడు. మనిషి స్వభావానికి అనుగుణంగా కాలాలను తీర్చిదిద్దాడు. ఒకే కాలాన్ని మనిషి ఎల్లప్పుడూ భరించలేడు. ఒకే కాలం ద్వారా మనిషి అవసరాలన్నీ తీరవు కూడాను. రాత్రి తరువాత పగలు, పగలు తరువాత రాత్రి ఏవిధంగానైతే వస్తూ పోతూ ఉంటాయో అదే విధంగా ఒక కాలం తరువాత మరో కాలం వస్తూ పోతూ ఉంటుంది. ఈ వచ్చే పోయే కాలాలు మనకు ఎన్నో గుణపాఠాలను కూడా నేర్పుతాయి. వాటిలో కొన్ని ఇవి :

1) ఒకదాని తరువాత ఒకటి కాలాలు మారుతూ, ఆ మారిన కాలాలు కనుమరుగైపోతూ ఉన్న విధంగానే ప్రపంచంలోని ప్రతి వస్తువూ కనుమరుగైపోయేదే అనే విషయాన్ని సూచిస్తున్నాయి. రోజులు గడచిపోతున్నాయి అంటే అర్థం ప్రపంచానికి, మనిషికి ప్రసాదించబడిన సమయం కాలగర్భంలో కలసి పోతూ ఉన్నదన్నమాట. ఏదో ఒక రోజున ఆ సమయం అంతమై పోయి లెక్కల ఘడియ వచ్చేస్తుంది. కనుక జ్ఞానవంతుడైన మనిషి ఈ సూచనలను అర్థం చేసుకుని జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: రేయింబవళ్ల పరిభ్రమణను ఆయనే చేస్తున్నాడు. కళ్ళున్న వారికి ఇందులో గుణపాఠం ఉంది. (24: 44)

2) చలి తీవ్రత మనిషిని ఏవిధంగా ప్రభావితం చేస్తుందో వివరించ వలసిన అవసరం లేదు. ఎంతో మంది అగత్యపరులు రాత్రిళ్ళు ఎలాంటి కప్పు లేకుండా, ఫుట్‌పాత్‌లపై గజగజ వణుకుతూ నిదుర పోతుంటారు. కనీసం కప్పుకోవటానికి వారికి ఒక కంబళి దొరకటం కూడా కష్టమవుతూ ఉంటుంది. ఎంతో మంది చలికి తట్టుకోలేక చనిపోతూ ఉంటారు. మరొకవైపు ఎంతో మంది చలిని ఆస్వాదిస్తూ ఎత్తైన భవనాలలో, సుఖవంతమైన గదులలో, మెత్తని పరుపులపై, వెచ్చని కంబళ్ళు కప్పుకుంటూ నిదురపోతుంటారు. ఇది వీరిపై అల్లాహ్ కారుణ్యం. ఇలాంటి వారికి అగత్యపరులు ఒక పరీక్ష. ఎందుకంటే వారు, వీరు అందరూ అల్లాహ్ దాసులే. కానీ ఒకరికి మరొకరు పరీక్ష వంటివారు. ఎవరికైతే అల్లాహ్ అనుగ్రహాలను ప్రసాదించాడో వారు ఆ అనుగ్రహాలకు బదులుగా కృతజ్ఞతలర్పించుకోవాలి. అది ఎలాగంటే, అగత్యపరులను చలి నుండి కాపాడి, వెచ్చని కంబళ్ళను ప్రసాదించి, వారి ఆకలిని తీర్చి ఆదుకోవాలి. అప్పుడు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఆస్వాదించటానికి అర్హులవుతారు. ఎందుకంటే ధనవంతుల ధనంలో పేదవారి హక్కు కూడా ఉంది. ఆ హక్కును నెరవేర్చక పోయినట్లయితే అల్లాహ్‌కు సమాధానమివ్వవలసి ఉంటుంది.

అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు :

అల్లాహ్ మీ కోసం మీ గృహాలను శాంతిని, విశ్రాంతినీ ఇచ్చే స్థలాలుగా తీర్చిదిద్దాడు. పశువుల చర్మాలతో ఆయన మీ కోసం ఇళ్ళను చేశాడు. మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు, బస చేసినప్పుడు ఈ రెండు స్థితులలోనూ అవి తేలికగా ఉంటాయి. పశువుల మృదు రోమాలతోనూ, ఉన్నితోనూ, వెంట్రుకలతోనూ మీ కోసం తొడుక్కునే వస్తువులను ఎన్నింటినో సృష్టించాడు. అవి జీవితకాలం అంతా మీకు పనికొస్తాయి. ఆయన తనచే సృష్టింపబడిన ఎన్నో వస్తువులతో మీ కోసం నీడను ఏర్పాటు చేశాడు. పర్వతాలలో మీ కోసం ఆశ్రయ స్థలాలను నిర్మించాడు. మిమ్మల్ని వేడిమి నుండి కాపాడే దుస్తులనూ, యుద్ధ రంగాలలో మిమ్మల్ని రక్షించే కవచాలనూ మీకు ప్రసాదించాడు. ఈ విధంగా ఆయన తన అనుగ్రహాలను మీకు పూర్తిగా ప్రసాదిస్తాడు, మీరు విధేయులవుతారేమోనని. (16: 80-81)

అల్లాహ్ ఈ వాక్యంలో ప్రస్తావించిన అనుగ్రహాలను మనిషికి

లభించినప్పుడు అతను నోటి ద్వారాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలి. చేతల ద్వారా కూడా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలి.

3) కాలాల మార్పు ద్వారా మరొక విషయం తెలిసేదేమిటంటే, విశ్వంలో ఉన్న ప్రతి వస్తువు అల్లాహ్ ఆజ్ఞలకు లోబడి ఉన్నది. భూమ్యాకాశాలు, సప్తాకాశాలు, సూర్యచంద్రులు, సముద్రాలు, పర్వతాలు ఒకటేమిటి సమస్తమూ దైవ విధేయతను కనబరు స్తున్నాయి. దాని కారణంగానే రాత్రి పగలు ఏర్పడటం, కాలాలు మారటం శాంతివంతంగా జరిగిపోతున్నాయి. అదేవిధంగా ఒక మనిషి అల్లాహ్‌ను విశ్వసించినట్లయితే ఆయన ఆజ్ఞాపించిన ప్రతి విషయాన్ని ప్రశాంతంగా ఆచరించి విధేయత చూపాలి. దైవ సృష్టితాలు ఇంతగా విధేయత చూపుతున్నప్పుడు సృష్టితాలన్నిం టిలో మహోన్నతుడైన మనిషి ఎంతగా విధేయత చూపాలో అర్థం చేసుకోవాలి.

4) చలికాలంలో నమాజు కోసం వుజూ చేసుకోవటం చాలా కష్టంగా అనిపిస్తుంది. కాని అల్లాహ్ ప్రసన్నత కోసం చలికాలంలో కూడా పూర్తి వుజూను చేసుకోవటం ఒక విశ్వాసి గుణ విశేషం. దీని కారణంగా అల్లాహ్ అతని పాపాలను క్షమించివేస్తాడని, అతని స్థానాలను ఉన్నతం చేస్తాడని సూచించటం జరిగింది. చలి కాలంలో ఒక విశ్వాసి పూర్తిగా వుజూ చేసుకోవటం అనేది అతనికి అది ఒక శిక్షణలాంటిది. సాధారణ పరిస్థితులలో దైవాజ్ఞలను పాలించటం అంత గొప్ప విషయమేమీ కాదు. కాని అసాధారణ పరిస్థితులలో దైవాజ్ఞలను పాలించటం గొప్ప విషయం. దీనిద్వారా మనిషిలో ఉన్న చిత్తశుద్ధి, సహనం, స్థైర్యం, త్యాగం లాంటి గొప్ప సుగుణాలు బహిర్గతమవుతాయి. అంతేకాదు, దీనిద్వారా ఎలాంటి కాలాలలోనైనా, ఎలాంటి పరిస్థితిలోనైనా అల్లాహ్ పంపిన సత్యధర్మం కోసం ఎలాంటి త్యాగాలకైనా సంసిద్ధంగా ఉన్నాము అనే ఒక బహిరంగ ప్రకటన వెలువడుతుంది.

5) చలికాలంలోనూ ఒక విశ్వాసి మస్జిద్‌కు వెళ్ళి జమాఅత్‌తో కలిసి నమాజ్ చెయ్యటం తప్పనిసరి. వృద్ధులకు, వ్యాధిగ్రస్తులకు అనుమతి లభిస్తుంది. కాని వెచ్చదనాన్ని ఆస్వాదించాలని ఏవో కుంటి సాకులు వెతుక్కుని ఇంటిలోనే నమాజు చేసుకోవటం మంచి విషయం ఎంత మాత్రమూ కాదు. వెచ్చదనాన్నిచ్చే బట్టలు, మఫ్లర్లు ధరించి అల్లాహ్ పిలుపునకు సమాధానమిస్తూ మస్జిద్‌కు హాజరవ్వటంలో లభించే ఆ ఆనందమే వేరు, ఆ తృప్తియే వేరు. ఆ రుచియే వేరు. అది ఆస్వాదించిన వారికే తెలుస్తుంది. ఎందు కంటే మస్జిద్ వైపునకు వేసే ఒక్కో అడుగులో దైవ ప్రేమ, దైవ విధేయత నిండి ఉంటుంది. ఇంకా 'ఓ అల్లాహ్! నేను నీ ప్రేమ పొందటానికి కఠిన మార్గాలను సైతం అనుసరించటానికి సిద్ధంగా ఉన్నాను' అనే ప్రకటన ఉంటుంది.

6) చలికాలం తీవ్రమైన చలి కారణంగా కఠినంగా ఉంటుంది. కాని పగటి కాలం తక్కువగాను, రాత్రి కాలం ఎక్కువ గాను ఉన్న కారణంగా విశ్వాసుల కోసం చలికాలం చాలా అమూల్య మైనదిగా ఉంటుంది. ఎందుకంటే, ఒక విశ్వాసి పగలు ఉపవా సాలు పాటించటానికి, రాత్రిళ్ళు జాగారం చేసి ఆరాధన చెయ్య టానికి అనువైనవిగా ఉంటాయి. కాబట్టి చలికాలం ఒక విధంగా విశ్వాసికి సంతోషాన్ని కలుగజేస్తుంది. చలికాలం వచ్చినప్పుడు అమీరుల్ మోమినీన్ హజ్రత్ ఉమర్(ర) ప్రజలను ఉద్దేశించి ఇలా సెలవిచ్చేవారు : 'చూడండి! చలికాలం వచ్చేసింది. తీవ్రమైన చలి నుంచి కాపాడుకోవటానికి వెచ్చదనాన్నిచ్చే వస్త్రాలు, మేజోళ్ళు, మఫ్లర్లు ధరించండి. ఎందుకంటే చలి మనిషి శరీరంలో అత్యంత త్వరగా జొరబడుతుంది. చాలా ఆలస్యంగా శరీరం నుంచి బయటకు వస్తుంది. ఇంకా రాత్రిళ్ళు నిద్ర నుంచి మేల్కొని తహజ్జుద్ నమాజ్ చెయ్యండి'.

ఒక విశ్వాసి రాత్రి నిద్ర నుంచి మేల్కొని తహజ్జుద్ నమాజ్ చెయ్యటం ద్వారా మామూలు దినాలలోనే అల్లాహ్‌కు అతను అత్యంత ప్రియుడవుతాడు. చలికాలంలోనైతే అతని విలువ మరింత పెరిగిపోతుంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర) చలికాలం రాగానే ఇలా సెలవిచ్చారు: 'ప్రజలారా! మీకు శీతాకాలపు శుభాకాంక్షలు. ఈ కాలంలో శుభాలు అవతరిస్తాయి. దీని రాత్రి సమయాలు అధికం గాను, పగటి సమయం తక్కువగాను ఉంటాయి. రాత్రిళ్ళు ఆరాధన చేసుకోవటానికి, పగలు ఉపవాసాలు ఉండటానికి అనువైనవిగా ఉంటాయి'.

7) చలికాలంలో సాధారణంగా దాదాపు అందరికీ జలుబు చెయ్య టం, జ్వరం రావటం జరుగుతూ ఉంటుంది. కరోనా వ్యాధి ప్రబలిన కారణంగా సాధారణ జలుబు, జ్వరం వచ్చినా ప్రజలు భయపడుతున్నారు. వ్యాధి చిన్నదైనా, పెద్దదైనా వ్యాధి వ్యాధే కదా! కనుక వ్యాధుల నుంచి రక్షణను ప్రసాదించమని ఎల్లవేళలా అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండాలి. అయినప్పటికీ ఒకవేళ వ్యాధికి గురైనట్లయితే సహనం వహించాలి. సహనానికి ప్రతిఫలం లభిస్తుంది, అంతేకాదు పాపాలు కూడా క్షమించబడతాయి.

ఒకసారి ఉమ్మె సాయబ్ (ర) జ్వరం బారిన పడ్డారు. దైవప్రవక్త(స) ఆమెను పరామర్శించటానికి వెళ్ళారు. 'ఓ ఉమ్మె సాయబ్! ఏమైంది?' అని అడిగారు. దానికి ఆమె గారు 'ఓ దైవప్రవక్తా(స)! జ్వరం వచ్చింది. దేవుడు జ్వరానికి అశుభాన్ని కలుగజేయుగాక!' అని అన్నారు. దానికి దైవప్రవక్త(స) 'ఓ ఉమ్మె సాయబ్ జ్వరాన్ని తిట్టబోకు. ఎందుకంటే ఏ విధంగానైతే అగ్ని ఇనుముకు పట్టిన తుప్పును వదిలిస్తుందో అదేవిధంగా జ్వరం పాపాల నుంచి మనిషిని పరిశుద్ధం చేస్తుంది'. (ముస్లిమ్)



# చదువుతోనే నైపుణ్యాభివృద్ధి

ముహమ్మద్ హనీఫ్, మార్కాపురం

**ప్రపంచంలో** మానవులను శాసించే అధికారం, సేవ చేసే భాగ్యం, ఉన్నత చదువులు చదివినవారికి ఎక్కువగా దొరుకుతుంది. అలాంటి విద్యను కాకుండా కొందరు ధనాన్ని కూడబెట్టడంలో పడిపోతున్నారు. వారు తెలుసుకోవాల్సింది ఏమిటంటే, ధనం కంటే జ్ఞానం మిన్న.

1) ధనాన్ని మీరు కాపాడితే... మిమ్మల్ని మాత్రం జ్ఞానం కాపాడు తుంది.

2) ధనవంతుడికి శత్రువులుంటారు... విద్యావంతుడికి స్నేహితు లుంటారు.

3) ధనం ఖర్చుపెడితే కరిగిపోతుంది.. జ్ఞానం ఖర్చుపెట్టిన కొద్దీ పెరుగుతుంది.

4) ధనం దొంగిలించబడుతుంది... జ్ఞానాన్ని ఎవరూ దొంగిలించ లేరు.

5) ధనం పరిమితమైనది... జ్ఞానం (చదువు) అపరిమితమైనది.

6) కాలంతోపాటు ధనం కరిగిపోతుంది.. జ్ఞానం అభివృద్ధి చెందు తుంది.

7) ధనం దైవద్రోహులను తయారుచేస్తే జ్ఞానం మనిషిని దైవానికి పరిచయం చేస్తుంది.

నేడు మనం చదువుతున్న చదువులకి జీవితానికి ఎటువంటి సంబంధం ఉండటం లేదు. బాల్యం నుండే పిల్లలను మంచి మనుషులుగా తయారుచేసే విద్యను నేర్పాల్సిన అవసరం ఉంది. మన చదువులు జీవితానికి ఉపయోగపడేలా చూసుకోవాలి.

ఇది అత్యాధునిక సాంకేతిక యుగం. ఎప్పటికప్పుడు ప్రత్యేకమైన నైపుణ్యాలు సొంతం చేసుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే మనం వెనుకబడిపోవడం తథ్యం. రానున్న సాంకేతికతలను ముందుగానే పసిగట్టి అన్ని విధాలా సన్నద్ధం కాగలగాలి. అప్పుడే యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోగలదు. నేడు దేశంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఏ దారిన వెళ్ళాల్లో తెలియని అయోమయ స్థితి ఏర్పడింది. చీకటిని చూస్తూ కూర్చుంటే మన దగ్గరకు వెలుతురు రాదు. అవకాశాల కోసం మనమే వెతుక్కుంటూ పోవాలి. యువత తలచుకుంటే సాధ్యం కానిది అంటూ ఏదయినా ఉంటుందా? చదువుకున్న యువతలో కనిపించే పెద్ద లోపం ఒకటి, రెండు దారులను ఎంపిక చేసుకుని, అవి కష్టమైనవయినా సరే వాటి గుండానే పయనించాలని ప్రయత్నించటం. మొదట కొంత సులభమైన మార్గంలో వెళితే ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుంది. యువత తమలో ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలి. మనకు రాదు మనం చెయ్యలేము, ఉన్నత శిఖరాలకు చేరుకోలేము అని మొదటే డిసైడ్ అయిపోకూడదు. అలా అనుకొని వారు తమ ప్రతిభను గుర్తించలేకపోతున్నారు. అడుగు ముందుకు వేయలేకపోతున్నారు. అలాంటి సందర్భంలో పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో గుర్తు తెచ్చుకోవాలి. ఉద్యోగ సాధనలో వెనుకబడకూడదు. జీవనోపాధి కోసం ప్రభుత్వ ఉద్యోగమే కావాలంటే కుదరదు. ప్రైవేట్‌లో లేదా స్వయం ఉపాధి రంగాలనూ ఎంచుకోవాలి.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం దక్కించుకోవాలంటే ఉత్తమ ప్రతిభ చూపాలి. మొదట యువత ఇంగ్లీషు మీద మంచి పట్టు సాధించాలి. తరువాత కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి. ఇవి రెండు ఇప్పుడు ప్రస్తుతం చదువుకున్నవారిలో తప్పనిసరిగా ఉండాలి.

నేషనల్ సైన్సు ఫౌండేషన్ అంచనా ప్రకారం రానున్న కాలంలో 80% దాకా కొలువులకు గణితం, సైన్సు అంశాలపై మంచి పట్టు ఉండాలి. దాంతోపాటు మెళకువలు అత్యవసరం. 'స్టెమ్ సైన్సు టెక్నాలజీ' ఇంజనీరింగ్ (మేథమెటిక్స్) సబ్జెక్టులతో ఆర్ట్స్ అంశాలను సమ్మిళితం చేస్తే యువతకు ఉపాధి పరంగా ఎంతో మేలు చేకూరుతుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా 180 కోట్ల యువ జనాభా ఉంది. భారత్‌లో 10-24 వయసు ఉన్నవారి సంఖ్య 33 కోట్లకుపైనే. వీరందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఇటీవల సాఫ్ట్‌వేర్ సర్వీసు కంపెనీల జాతీయ సంఘం నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో కొత్తగా నిగ్గుతేలిన యదార్థమిదే. పాఠశాల, ఇంటర్ స్థాయి బోధనల్లో ప్రయోగాలు విధిగా అంతర్భాగం కావాలి. తాజా అధ్యయన సారాంశం పాఠ్యప్రణాళికల్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయాలని, పారిశ్రామిక అవసరాల మేరకు విద్యారంగ సంస్కరణలు చేపట్టాలని 'నాస్కామ్' పిలుపునిచ్చింది. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించటం ఎంత ముఖ్యమో, బోధనా సిబ్బందిని నిరంతరం శిక్షణ ఇవ్వడమూ అంతే కీలకమైనది.

కోవిడ్ సంక్షోభం వేళ ఆన్‌లైన్ తరగతుల బోధనల్లో పాతిక శాతం గురువులకు ఎటువంటి శిక్షణ లేదని వెల్లడైంది. ఖాళీలు లక్షల సంఖ్యలో పేరుకుపోయాయి. యువత ఉన్నత చదువులు చదివినా నైపుణ్యాల లేమి వల్ల వారి పట్టాలు నిరర్థకమై ఉపాధి వేటలో ముందుకు సాగలేకపోతున్నారు. అందుకే పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్ని శ్రద్ధగా సానపట్టి వారి ఆసక్తికి అనుగుణమైన రంగంలో నిపుణులుగా వారిని తీర్చిదిద్దాలి.

మనం ఒకసారి ప్రపంచ దేశాలను పరిశీలించినట్లయితే చైనాలో వృత్తి నిపుణుల సంఖ్య పెరుగుతోంది. దక్షిణ కొరియా, జర్మనీ, యూ.కే తదితర దేశాలు యువతను నిపుణులుగా తీర్చిదిద్దుతున్నారు.

నేడు డిగ్రీల కన్నా నైపుణ్యాలు మిన్న అనే వాతావరణం నెలకొంది. పోనుపోను 'కృత్రిమ మేథ', 'సైబర్ భద్రత', 'డేటా ఎనలిటిక్స్' తదితర విభాగాల్లో ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటికనుగుణంగా యువత తమను సన్నద్ధం చేసుకోవాలి. తమలో నిపుణతను పెంచుకోవాలి.

ఉత్తమ ఇంజనీర్లు, వైద్యులు చురుకైన న్యాయవాదులు కావాలి. ఇంకా కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్‌లలో మేథావులు దేశానికి చాలా అవసరం. విశ్వంలో భారత్ గొప్ప అభివృద్ధి సాధించగలదు. "ప్రజలారా! విద్యను అర్జించండి. అల్లాహ్ వద్ద ఒక ప్రత్యేకమైన ప్రేమ దుప్పటి ఉంటుంది. దాన్ని విద్యను అర్జించే వారిపై కప్పబడుతుంది." అన్నారు మహాప్రవక్త(సఅసం). విద్య జ్ఞానాన్ని పెంపొందించి మనసులోని అజ్ఞాన అంధకార చీకట్లను పారద్రోలి విజ్ఞానపు వెలుగు నింపుతుంది. మంచి- చెడు ఏమిటో తెలుపుతుంది. విద్య ధర్మాధర్మాల విచక్షణను తెలియజేసి, తన తోటి వారితో ఎలా మెలగాలో, ఎలా మెలిగితే తాను కోరుకునే సుఖ సంతోషాలు పొందగలడో వివరిస్తుంది. విద్య మానవీయ సంబంధాలు, విలువలను గుర్తించి తన చుట్టూ ఉన్న ప్రకృతిని ఎలా వినియోగించుకోవాలి, ఎలా వినియోగించుకుంటే దాని సమతుల్యత చెడిపోకుండా తనకు, ఇంకా రాబోయే తన తరానికి ఎలాంటి హాని కలిగించదో వివరిస్తుంది జ్ఞానం, విద్య.



**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# పఠనంతోనే వికాసం

- హుమేరా అమీర్, ఏలూరు

**ఈ సృష్టిలో** మనిషికీ, మిగతా జీవరాశులకీ మధ్య ఉన్న తేడా 'జ్ఞానం'. అయితే ఎవరూ పుట్టుకతో జ్ఞాని కాలేరు. జ్ఞానాన్ని అర్జించాలంటే అధ్యయనం తప్పనిసరి. అయితే మొబైల్ విప్లవం పుణ్యమా అని పుస్తకాలు చదివేవారు తక్కువయిపోయారు. విద్యార్థులు పాఠాలు కూడా మొబైల్‌లోనే చదువుకునే పరిస్థితి ఏర్పడింది. ఇంటర్నెట్ పుణ్యమా అని గ్రంథాలయాలకు వెళ్ళేవారు తక్కువయి పోయారు. పూర్వం ఒకపూట అన్నం తినడం మానేసి అయినా ఒక మంచి పుస్తకం కొనుక్కోవాలి అనుకునేవారు, ఇప్పుడు ఉచితంగా ఇస్తామన్నా పుస్తకాలు తీసుకునేవారు లేరు, మొహమాటానికి పుస్తకాలు తీసుకున్నా వాటిని చదివేవారు లేరు. కారణం పుస్తక పఠనం ప్రాముఖ్యతని, పఠనాసక్తిని మొబైల్ ఫోన్ ఆక్రమించేసింది.

ఒకప్పుడు విద్యార్థులు మాత్రమే కాదు ప్రయాణంలో కూడా ప్రతి ఒక్కరి చేతిలో వార్తా పత్రికో, నవలో ఉండేది. ఈ పుస్తక పఠనం వల్ల విషయ పరిజ్ఞానంతో పాటు లోకజ్ఞానం కూడా అందరిలో ఉండేది, కానీ ఇప్పుడు సాంకేతికత పేరుతో మొబైల్ ఫోన్‌లు అధికంగా వాడడం వల్ల విషయ పరిజ్ఞానం పొందడం సంగతి ఎలా ఉన్నా తమకు నచ్చిన పుస్తకాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, పిల్లల నుండి పెద్దల వరకు దానికే అతుక్కుని, మిగిలిన విషయాలు ఏదీ పట్టించుకోకుండా ఉండే పరిస్థితి వచ్చింది.

## పుస్తక పఠనం వల్ల ఉపయోగాలు ఎన్నో

శరీరానికి వ్యాయామం ఎంత మేలు చేస్తుందో, మెదడుకు పుస్తక పఠనం అంతే మేలు చేస్తుంది. కానీ ఈ మొబైల్ ఫోన్‌లకు అతుక్కుని ఉండిపోవడం వల్ల నేటి తరానికి శారీరక, మానసిక వ్యాయామం లేకపోవడం వల్ల మెదడు చురుకుదనం, సానుకూల దృక్పథం తగ్గింది, విపరీత ఆలోచనా ధోరణి అలవడింది. ఫలితంగా చిన్న పిల్లలలో ఆత్మహత్యా ధోరణి, ప్రతికూల ఆలోచనా విధానం, నేరాల సంఖ్య పెరుగుతోంది.

పుస్తకాలు మెదడును చురుకుగా చేస్తాయి. మానసిక ఎదుగుదలకు అవసరం. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడితో సమానం అంటారు. పఠనం ద్వారా జ్ఞానం, పద సంపద పెరుగుతుంది. మనుషుల వ్యక్తిత్వాల పట్ల, సమాజం పట్ల, సమాజంలోని వివిధ అంశాల పట్ల సరైన అవగాహన వస్తుంది. అందుకే పుస్తకాలు చదివేవారు జీవితాన్ని బాగా అర్థం చేసుకోగలరని పెద్దలంటారు.

పుస్తక పఠనం వల్ల మనిషికి మానసిక సంస్కారం కలిగి, పరిపూర్ణ వ్యక్తిత్వం అలవడుతుంది. ఒకప్పుడు చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు వంటి ఎన్నో పుస్తకాలు బాలల కోసం వెలువడేవి. ఇటువంటి పుస్తకాల పఠనం వల్ల పిల్లలలో చిన్నప్పటినుండీ నీతినియమాల పట్ల ఆసక్తి పెరిగి, ఆచరణాత్మకంగా నైతికత వృద్ధి చెందేది.

పుస్తకాలు చదవడం వలన మన మెదడు విషయ పరిజ్ఞానం పొందడమే కాకుండా పుస్తకాలతో మన మనసు సహవాసం చేస్తుంది. పుస్తక పఠనం అంటే ఆ పుస్తకాన్ని రాసిన వ్యక్తితో ప్రత్యక్షంగా సంభాషించడమే.

పుస్తక పఠనం వల్ల మానసిక అభివృద్ధి జరుగుతుంది. మానసిక పరిధి విస్తరిస్తుంది అని ఎన్నో పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

శరీరానికి వ్యాయామం అవసరమయినట్లే మనసుకు పుస్తక పఠనం అవసరం అంటారు అబ్రహం లింకన్. ఒక మంచి పుస్తకం 100 మంది స్నేహితులతో సమానం అంటారు అబ్దుల్ కలాం.

పుస్తక పఠనం వల్ల ప్రశాంతమైన నిద్రను పొందగలుగుతాం. నిద్రకు ఉపక్రమించడానికి ముందు వరకూ, టీవీ చూడడం, మొబైల్స్ చూడడం, కంప్యూటర్‌లపై పనిచేయడం వంటి పనుల వల్ల ఎక్కువ మంది నిద్రలేమి సమస్యకి గురవడమే కాకుండా కంటిచూపు మందగించడం, ఇంకా ఇతర రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కానీ నిద్రకు ఉపక్రమించే ముందు పుస్తక పఠనం చేయడం వల్ల నిద్రమాత్రలు లేకుండానే ప్రశాంతమైన నిద్రను పొందగలుగుతాం అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

పుస్తక పఠనం మనిషిని ఒంటరితనం నుండి దూరంగా తీసుకుని వెళ్తుంది. ఒక మంచి పుస్తకం చదువుతున్నంతసేపూ ఆ పుస్తకం మనిషిని ఒక స్నేహితుడి మాదిరిగా, ఆత్మీయుడి మాదిరిగా ఆనందతీరాల్లో విహరింపజేస్తుంది. అంతేకాదు ఒక పుస్తకాన్ని చదవడం అంటే ఒక జ్ఞానితో సంభాషించడమే.

పుస్తక పఠనం ఏకాగ్రతను పెంచుతుంది. ఎందుకంటే ఒక పుస్తకాన్ని చదువుతున్నంతసేపూ మనిషి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మర్చిపోతాడు. త్రికరణశుద్ధిగా అతని మెదడు, శరీరం మొత్తం ఆ పుస్తక పఠనంలో లీనమవుతాడు. దానివల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.

పుస్తక పఠనం వల్ల మనిషి ఎన్నో మానసిక, శారీరక రోగాల నుండి దూరంగా ఉండగలుగుతాడు. ఈ రోజుల్లో చాలా అనారోగ్యాలకు కారణం చేసే పనిలో ఒత్తిడి, శ్రమ పెరిగిపోవడం వల్లనే.

పుస్తక పఠనం అలవాటు లేని యువకులతో పుస్తక పఠనం అలవాటు ఉన్న యువకులను పోల్చి చూస్తే, పుస్తకాలు చదివేవారు లోక జ్ఞానంలోనే కాదు వివిధ రకాల సామర్థ్యాలలోనూ మెరుగైన ప్రతిభను కనబరుస్తున్నారని బ్రిటన్‌లోని నేషనల్ లిటరసీ ట్రస్ట్ చేసిన అధ్యయనంలో తేలింది.

చిన్నప్పటి నుండి కాకపోయినా కనీసం టీనేజ్‌లో పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం వల్ల తమ జీవిత లక్ష్యాన్ని నిర్ధారించుకునే స్పృహ ఏర్పడుతుంది. లక్ష్యసాధనా మార్గాలు తెలుస్తాయి. పట్టుదల ఏర్పడుతుంది. లక్ష్య సాధనకు కావలసిన సామర్థ్యాలు పెరుగుతాయి. సామాజిక సమస్యలపై అవగాహన ఏర్పడుతుంది. క్లిష్టమైన సమస్యలకు సులువైన పరిష్కారాలు కనుక్కోగలుగుతారు. స్వీయ విశ్లేషణ సామర్థ్యం పెరుగుతుంది. పది మందిలో ఆకర్షించేలా మాట్లాడే సామర్థ్యం పెరుగుతుంది. సానుకూల దృక్పథం ఏర్పడుతుంది.

పుస్తక పఠనం వల్ల ఊహాత్మక శక్తి పెంపొందుతుంది. టీవీ చూడడం, మొబైల్ చూడడం వల్ల ఎవరో చిత్రించిన చిత్రాలను కళ్లప్పగించి మనం చూస్తాం, కానీ పుస్తకం చదివేటప్పుడు సందర్భానుసారం మన మెదడు ఊహా చిత్రాలను చిత్రించేస్తుంది. పైగా ఆ ఊహా చిత్రాలు కొంతకాలం వరకూ మన మెదడులో నిక్షిప్తమైపోయి ఉండిపోవడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.

మొబైల్ ఫోన్‌లో రకరకాల Aapలు డౌన్‌లోడ్ చేసుకుని చూడడం ద్వారా చెత్తనంతా అందరం కలసికట్టుగా మన బుర్రల్లో కూరేసుకుంటున్నాం. ఇది ఎలాంటి విపరీతమైన పరిణామాలకు, భయంకరమైన పరిస్థితులకు దారి తీస్తుందో పట్టించుకోలేని పరిస్థితిలోనే అందరం ఉన్నాం. కానీ పుస్తక పఠనం ఆ విధంగా కాదు. ఎన్ని ఎక్కువ పుస్తకాలు చదివితే మెదడు అంత చురుకుగా పని చేస్తుంది. మేధావి వర్గంగా మనం పిలుచుకునేవారు పుస్తక ప్రియులని మనం గుర్తుంచుకోవాలి.

పుస్తక పఠనం మనిషిని ఉత్తమునిగా వివేకవంతునిగా తీర్చిదిద్దడమే కాదు, భాషపై పట్టును, ఆధిపత్యాన్ని కలిగిస్తుంది. ప్రపంచంలోని మేధావులు, గొప్పవాళ్ళంతా ఆకలి దప్పులు మరచి గ్రంథాలయాల్లో గడిపిన వాళ్ళే.

మేధావులు పుస్తకాలకు ఎంత విలువనిస్తారంటే మన భారత మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత, భారత రత్న గ్రహీత అయిన అబ్దుల్ కలామ్ గారు మరణించిన తర్వాత ఆయన నివసించిన గదిలో ఆయన వాడిన బట్టలు గట్టిగా అర డజను జతలు కూడా లేవు కానీ పుస్తకాలు మాత్రం 2500 పుస్తకాలు పైగా ఉన్నాయి.

పుస్తక పఠనం వల్ల సామాజిక చైతన్యం అలవడితే, మొబైల్ ఫోన్ మరియు సాంకేతిక వస్తువుల అధిక వాడకం వల్ల సంకుచిత మనస్తత్వం ఏర్పడుతోంది. తద్వారా స్వార్థం, కుటిలమైన ఆలోచనా ధోరణి, నేర పూరిత వాతావరణం సృష్టించడం వంటివి ఈ ప్రపంచాన్ని ఏలుతున్నాయి. అందువల్ల పుస్తక పఠనం యొక్క ఆవశ్యకతను గుర్తించి పెరుగుతున్న సాంకేతికతకు దీటుగా పఠనంపై ఆసక్తిని పెంచుకుని, వ్యక్తిగత, సామాజిక చైతన్యాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది.

పుస్తక పఠనం మూల పడిపోవడం వల్ల విద్యార్థులలోను, రచయితలలోనూ చాలా వరకు వ్రాత నైపుణ్యాలు, రచనా సామర్థ్యాలు చాలావరకు తగ్గిపోయాయి, మెదడు పనిచేయడం పూర్తిగా మానేసింది. ఒకప్పుడు సాహిత్యరంగంలో పనిచేసేవారికి వారి భాషపై గట్టి పట్టు ఉండేది. అది వారి రచనా వ్యాసంగాలలో కనిపించేది. ఇప్పుడది లేదు. కొన్ని కొన్ని పత్రికలకు కొంత మంది కవులు బ్రాండ్ అంబాసిడర్ లాగా పనిచేసేవారు. పత్రిక చూడగానే అందులో నైపుణ్యమైన సమాచారం దొరికేది. ఇప్పుడటువంటి నైపుణ్యాలు తగ్గిపోయాయి. కారణం పుస్తక పఠనం కేవలం విద్యార్థులకు, మలి వయసులో బాధ్యతలన్నీ పక్కన పెట్టి ఖాళీగా ఉండేవాళ్ళకు, ఒకవిధంగా పాఠకులకు మాత్రమే కాదు రచయితలకు, కవులకు కూడా పుస్తక పఠనం అత్యంత అవసరం అని మర్చిపోవడం.

పుస్తకంలో, పత్రికలో సరైన సమాచారం దొరకనప్పుడు ఆటోమేటిక్‌గా చదువరులు కూడా తగ్గిపోతుంటారు. ముఖ్యంగా సంస్థలు దీనిపై దృష్టి పెట్టాలి. సరైన సమాచారం, మంచి సాహిత్యం దొరికితే చదవడానికి ఈ రోజుల్లోనూ చాలామంది పాఠకులు ఉన్నారు.

మంచి పుస్తకాలు అందించడం కేవలం ఆ పుస్తక ముద్రణా కార్యాలయం బాధ్యత మాత్రమే కాదు. ఇది ప్రభుత్వాల బాధ్యత కూడా. పాఠకులు లేక కొన్ని ముద్రణాలయాలు మూతపడితే, సరైన ఆర్థిక వనరులు లేక, ప్రభుత్వసాయం అందక మూత పడుతున్న ముద్రణాలయాలు ఎన్నో ఉన్నాయి. అలాంటివాటి గురించి ప్రభుత్వం పట్టించుకోవాలి. కవులకు, రచయితలకు, ముద్రణా సంస్థలకు చేయూతనిచ్చి మంచి సాహిత్యాన్ని, ఉపయోగకరమైన సమాచారాన్ని ప్రజలకు అందించేలా చూడాలి. ప్రభుత్వాల నుండి ప్రోత్సాహం లేదు. కాబట్టి ఉత్తమ పాఠకులను తయారు చేసే అవకాశాన్ని ముద్రణా సంస్థలు కోల్పోతున్నాయి.

పుస్తకం అనగానే అది విద్యార్థులు చదివే పాఠ్య పుస్తకం అంటూ అక్కడే ఆగిపోకుండా సామాజిక బాధ్యత కలిగిన పుస్తకాలను, సామాజిక సమస్యలను విశ్లేషించే సాహిత్యం కలిగి ఉండాలి. అప్పుడే వ్యక్తులకు, సమాజానికి, దేశానికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

'చరితార్థులు'



# షౌకత్ ఉస్మాని (1901-1978)

110

**మాతృభూమి** నుండి సామ్రాజ్యవాద దోపిడి శక్తులను తరిమివేయడం మాత్రమే కాకుండా సామ్యవాద వ్యవస్థ ఏర్పాటు కోసం ఉద్యమించిన షౌకత్ ఉస్మాని 1901 డిసెంబర్ 21న రాజస్థాన్ రాష్ట్రం బీకనీర్ లోని ఒక కళాకారుల కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు మౌలా బక్ష్ ఉస్తా (Maulla Bux Usta) కాగా విప్లవ కారుడిగా పలు పేర్లతో వ్యవహరించిన ఆయన చివరకు 'షౌకత్ ఉస్మాని'గా స్థిర పడ్డారు. చిన్ననాటనే ప్రముఖ జాతీయోద్యమ నాయకులు సంపూర్ణానంద గురుత్వం లభించటం వలన షౌకత్ ఉస్మాని చిన్న వయస్సులోనే జాతీయ భావనలను సంతరించుకున్నారు. ఖిలాఫత్ ఉద్యమంతో జాతీయోద్యమంలో నేరుగా ప్రవేశించిన షౌకత్ ఉస్మాని 1920 జూన్ మాసంలో మౌల్వీ అబ్దుల్ బారి పిలుపు మేరకు భారత దేశం వెలుపల నుండి బ్రిటిషర్ల మీద యుద్ధం ప్రకటించాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం మేరకు లక్ష్యసాధన కోరకు స్వదేశం వదలి వెళ్ళిన యువకుల్లో షౌకత్ ఉస్మాని చేరారు. ఆ విధంగా సాహసోపేత చారిత్రక 'హిజ్రత్'కు పూనుకున్న షౌకత్ ఉస్మాని తీవ్ర ప్రతికూల పరిస్థితులలో రష్యా చేరుకున్నారు. ఆయన కమ్యూనిజం పట్ల ఆకర్షితులు కావడం, అధ్యయనం చేయడం మాత్రమే కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరయ్యారు. బ్రిటిష్ ప్రభుత్వం మీద కత్తికట్టేందుకు, కమ్యూనిస్టు ఉద్యమాన్ని మాతృదేశంలో నిర్మించేందుకు బ్రిటిష్ గూఢచారి దళాల కన్నుగప్పి రష్యా నుండి చాకచక్యంగా ఆయన స్వదేశం చేరుకున్నారు. కమ్యూనిస్టుల మీద కన్నేసిన బ్రిటిష్ రహస్య పోలీసుల దళం 1923 మే 11న షౌకత్ ఉస్మాని కన్నేసి అనుసరించి అరెస్టు చేయడంతో చరిత్రాత్మక పెషావర్ కుట్ర కేసులో ఆయన నిందితులయ్యారు. ఈ కేసులో ఆయనకు 16 సంవత్సరాల జైలుశిక్ష విధించారు. ఆ కారణంగా ఆయన సంవత్సరాల తరబడి దుర్భర జైలు జీవితాన్ని చవిచూశారు. విడుదల తరువాత జాతీయోద్యమంలో పాల్గొంటూనే భారతదేశంలో సామ్యవాద భావజాలాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు 1925 డిసెంబర్‌లో స్వదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన వారిలో ఒకరయ్యారు. ఆ క్రమంలో జాతీయ కాంగ్రెస్‌కు దూరమైనప్పటికి బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా సాగుతున్న జాతీయోద్యమానికి ఆయన సహకరించారు. రచయితగా, కమ్యూనిస్టుగా, జాతీయోద్యమకారుడిగా షౌకత్ ఉస్మాని తనదైన తీరులో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నిరంతరం ఉద్యమించారు. స్వాతంత్ర్యం లభించాక షౌకత్ ఉస్మాని ప్రస్తుతం పాకిస్తాన్‌లో భాగమైన కరాచి పట్టణానికి వెళ్ళిపోయారు. కరాచిలో కూడా కార్మిక జనసముదాయాల పక్షం వహించి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. అక్కడ కొంతకాలం గడిపాక పలు దేశాలు పర్యటిస్తూ జర్నలిస్టుగా అంతర్జాతీయ వ్యవహారాల మీద సైద్ధాంతిక వ్యాసాలను రాస్తూ కమ్యూనిస్టు మేధావిగా ఆయన బహుళ ప్రాచుర్యం పొందారు. చివరికంటా బ్రిటిష్ వలసపాలకుల పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ, విముక్తిపోరాట యోధుడుగా, శ్రామికజన పక్షపాతిగా పోరాటాలు సాగించిన షౌకత్ ఉస్మాని 1978లో కన్నుమూశారు. ✤



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిస్టర్డ్) ఇస్లామీ సాహిత్యం - వివరాలు

| పుస్తకం పేరు | బుక్ కోడ్ | వెల |
|---|---|---|
| **ఖుర్ఆన్ (Quran)** | | |
| 01. దివ్యఖుర్ఆన్ | 14 | 375 |
| 02. ఖుర్ఆన్ అవగాహనకు మూలసూత్రాలు | 32 | 25 |
| 03. అల్ ఫాతిహా | 52 | 12 |
| 04. దివ్య ఖుర్ఆన్ 30వ భాగం | 57 | 40 |
| 05. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-10 | 87 | 300 |
| 06. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-1 | 131 | 200 |
| 07. ఖుర్ఆన్ దైవ గ్రంథం | 137 | 20 |
| 08. **The Holy Quran is Infallabil (English)** | 173 | 150 |
| 09. దివ్య ఖుర్ఆన్ భావానువాదం | 216 | 200 |
| 10. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-2 | 218 | 250 |
| 11. ఖుర్ఆన్ గమ్యపథం | 222 | 15 |
| 12. దివ్య ఖుర్ఆన్‌లోని పారిభాషికాలు | 242 | 50 |
| 13. ఖుర్ఆన్ వెలుగు | 253 | 25 |
| 14. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-4 | 260 | 250 |
| 15. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-5 | 272 | 250 |
| 16. ఖుర్ఆన్ సౌరభాలు | 278 | 160 |
| 17. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-6 | 286 | 350 |
| 18. దివ్యఖుర్ఆన్ పరిచయం | 288 | 100 |
| 19. ఖుర్ఆన్ అవగాహనం-సూరె నూర్ | 294 | 100 |
| 20. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-7 | 296 | 350 |
| 21. దివ్యఖుర్ఆన్ కుటుంబ వ్యవస్థ | 298 | 30 |
| 22. ఖుర్ఆన్ వెలుగులో యువకులు | 301 | 75 |
| 23. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి- 8 | 308 | 400 |
| 24. ఖుర్ఆన్ అవగాహనం - సంపుటి-3 | 1249 | 300 |
| 25. **E- Quran (M.P.3` Software CD)** | 8002 | 30 |
| **హదీసు పుస్తకాలు (Hadees Books)** | | |
| 26. హదీసు వెలుగు | 77 | 175 |
| 27. ప్రవక్త ప్రవచనం | 80 | 100 |
| 28. మాటల ముత్యాలు | 98 | 40 |
| 29. సూక్తి శతకం (పద్యరూపం) | 176 | 15 |
| 30. హదీసు ప్రబోధిని-1 | 195 | 150 |
| 31. సహీహ్ బుఖారీ-1 | 279 | 300 |
| 32. సహీహ్ బుఖారీ-2 | 287 | 250 |
| **32ఎ. సహీహ్ బుఖారీ-3** | **334** | **400** |
| 33. ఉన్నత వ్యక్తిత్వానికి ఉత్తమ గుణాలు | 295 | 25 |
| **ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం (Seerath Books)** | | |
| 34. మహాప్రవక్త ముహమ్మద్ (స) | 13 | 150 |
| 35. హేతువు కాంతిలో దైవప్రవక్త (స) | 18 | 20 |
| 36. ఆదర్శమూర్తి | 21 | 25 |
| 37. దివ్య ఖుర్ఆన్ ముహమ్మద్ (స) రచనకాదు | 23 | 12 |
| 38. ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ | 73 | 30 |
| 39. దివ్య గ్రంథంలో దైవప్రవక్త | 81 | 10 |
| 40. ప్రియ ప్రవక్త | 91 | 25 |
| 41. ఎడారి పువ్వు | 125 | 150 |
| 42. మానవ మహోపకారి ముహమ్మద్ (స) (చిన్నది) | 138 | 15 |
| 43. మిలాద్ ఉన్ నబీ (స) | 162 | 8 |
| 44. ప్రవక్త పలుకులు - జరిగిన సంఘటనలు | 169 | 15 |
| 45. భారతీయ ధార్మిక గ్రంథాల్లో మహనీయ ముహమ్మద్ (స) | 237 | 40 |
| 46. మానవ మహోపకారి ముహమ్మద్ (స) (పెద్దది) | 269 | 150 |
| 47. ముహమ్మద్ (స) అందరి కోసం | 280 | 40 |
| 48. Muhammad The Prophet of Islam(PBHU)-English | 293 | 20 |
| 49. ప్రవక్త జీవితం - ఆదర్శ దృశ్యమాలిక | 246 | 35 |
| 50. ప్రియ ప్రవక్త(స) విశిష్ట వ్యక్తిత్వం | 300 | 30 |
| 51. అందరి ప్రవక్త ముహమ్మద్ (స) | 310 | 30 |
| **జీవిత చరిత్రలు (Life Histories)** | | |
| 52. దైవప్రవక్తలు - 1 | 7 | 15 |
| 53. దైవప్రవక్తలు - 2 | 39 | 15 |
| 54. దైవప్రవక్తలు - 3 | 40 | 15 |
| 55. దైవప్రవక్తలు - 4 | 42 | 30 |
| 56. ప్రవక్త సందేశం | 56 | 25 |
| 57. హజ్రత్ ఉమర్ ఫారూఖ్-యె-ఆజం (రజి) | 109 | 35 |
| 58. హజ్రత్ ఉస్మాన్ గని (రజి) | 115 | 20 |
| 59. ప్రవక్త వారి ప్రాణ మిత్రులు | 118 | 35 |
| 60. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) | 119 | 25 |
| 61. హజ్రత్ అలీ (రజి) | 120 | 25 |
| 62. దైవ దౌత్యం ముగింపు | 123 | 30 |
| 63. హజ్రత్ ఆయెషా సిద్దీఖా (ర.అన్హా) | 126 | 40 |
| 64. హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి) | 145 | 12 |
| 65. ఒయాసిస్సు | 208 | 36 |
| 66. ప్రవక్త (స) కుమార్తెలు | 284 | 25 |
| **జమాఅతె ఇస్లామీ హింద్ ఉద్యమ సాహిత్యం (History of J.I.H)** | | |
| 67. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర - 1 | 83 | 40 |
| 68. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర - 2 | 94 | 35 |
| 69. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర - 3 | 114 | 80 |
| 70. జమాఅతె ఇస్లామీ హింద్ ప్రాధాన్యతలు | 122 | 15 |
| 71. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర - 5 | 192 | 80 |
| 72. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర - 4 | 197 | 50 |
| 73. జమాఅతె ఇస్లామీ హింద్ సందేశం భారత దేశం భవిష్యత్తు | 214 | 14 |
| 74. సత్యధర్మంలో సంఘ జీవనం | 255 | 35 |
| 75. ఇస్లామీయ ఉద్యమం | 258 | 80 |
| 76. ఇస్లామీయ ఉద్యమం, కార్యకర్తలసంబంధాలు | 263 | 30 |
| 77. ఇస్లామీయ ఉద్యమం, విజయానికి సోపానాలు | 265 | 35 |
| **సందేశసాహిత్యం (Dawa Literature)** | | |
| 78. ధర్మ సంస్థాపనం | 1 | 25 |
| 79. ఇస్లాం పరిచయం | 2 | 25 |
| 80. ఇస్లాం వాస్తవికత (ఖుత్బాత్-2) | 4 | 25 |
| 81. మరణానంతర జీవితం | 12 | 15 |
| 82. శ్రేయస్కర మార్గం | 15 | 25 |
| 83. కారుణ్య వ్యవస్థ | 24 | 25 |
| 84. ఇదియే ఇస్లాం | 27 | 90 |
| 85. యదార్థమేది? | 28 | 15 |
| 86. లోకశాంతి | 30 | 15 |
| 87. దైవ నియమావళి | 31 | 12 |
| 88. ఇస్లామీ మతధర్మం | 37 | 20 |
| 89. సత్యధర్మం | 38 | 25 |
| 90. నేను ఆరాధించే ఇస్లాం | 41 | 60 |
| 91. సాక్ష్యం మానవాళి సమక్షంలో | 43 | 25 |
| 92. ధర్మపథంలో జీవన రథం | 51 | 18 |
| 93. నిర్మాణం - విచ్ఛిన్నం | 53 | 25 |
| 94. ప్రభువు పిలుస్తున్నాడు | 71 | 60 |
| 95. మానవులంతా ఒక్కటే | 89 | 20 |
| 96. మానవ సేవ | 92 | 15 |
| 97. సామాజిక న్యాయం | 96 | 10 |
| 98. భారతీయ సమాజంలో పరమత సహనం | 100 | 30 |
| 99. భారత దేశంలో ఇస్లాం సందేశం | 104 | 35 |
| 100. సత్యాన్వేషణ | 106 | 25 |
| 101. మానవుల్లో సోదర భావం | 110 | 15 |
| 102. శాంతి ఎలా స్థాపించబడుతుంది? | 111 | 30 |
| 103. ఇస్లాం అధ్యయనం ఎందుకు చేయాలి? | 112 | 15 |
| 104. సత్య సందేశం - ముస్లిమేతరులు | 168 | 20 |
| 105. ఇస్లాం ధ్యేయం ఏమిటి? | 182 | 30 |
| 106. ఇస్లామీయ వ్యవస్థలో ముస్లిమేతరులహక్కులు | 189 | 25 |

| పుస్తకం పేరు | బుక్ కోడ్ | వెల |
|---|---|---|
| 107. ఏకేశ్వరవాదమంటే? | 202 | 20 |
| 108. ఏకేశ్వరవాద మౌలిక భావన | 281 | 40 |
| **దళితులు - ఇస్లాం (Dalit-Islam)** | | |
| 109. అంటరానితనం | 25 | 2 |
| 110. దళితులసముద్ధరణ - ఇస్లాం | 200 | 50 |
| **బాలలసాహిత్యం (Children's Literature)** | | |
| 111 ఖుర్‌ఆనీ గాథలు | 9 | 10 |
| 112. నీతి కథలు - 1 | 33 | 15 |
| 113. నీతి కథలు - 2 | 34 | 15 |
| 114. నీతి కథలు - 3 | 44 | 20 |
| 115. నీతి కథలు - 4 | 45 | 20 |
| 116. విరిసిన మొగ్గలు | 50 | 10 |
| 117. ప్రియమైన అమ్మకు | 60 | 10 |
| 118. తీర్పులు | 62 | 20 |
| 119. ఈ తల్లి ఒడిలో | 63 | 15 |
| 120. మహనీయులబాట-1 | 66 | 35 |
| 121. మహనీయులబాట-2 | 67 | 35 |
| 122. మణిహారం -1 | 68 | 12 |
| 123. మణిహారం - 2 | 69 | 15 |
| 124. ఇస్లాం ప్రబోధిని - 1 | 86 | 55 |
| 125. ఇస్లాం ప్రబోధిని - 2 | 99 | 60 |
| 126. ఇస్లాం ప్రబోధిని - 3 | 108 | 80 |
| 127. బాలశ్రామికులు | 121 | 10 |
| 128. ఇస్లాం ప్రబోధిని - 4 | 127 | 80 |
| 129. బాలలసంవత్సరం - ఇస్లామీ సందేశం | 171 | 10 |
| 130. బాలబాలికలకు ఖుర్‌ఆన్ పరిచయం | 185 | 30 |
| 131. బాలబాలికలు - ఇస్లాం పరిచయం | 212 | 30 |
| 132. భోలా భయ్యా | 217 | 15 |
| 133. బాలబాలికలకు మంచి కథలు | 221 | 25 |
| 134. బాలవనం | 268 | 80 |
| 135. బుష్రా ఉత్తరాలు | 8003 | 5 |
| 136. దానా హకీం | 135 | 25 |
| **చరిత్ర (History)** | | |
| 137. షహీద్-యె-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్ | 140 | 40 |
| 138. మైసూర్ పులి - టిప్పు సుల్తాన్ | 141 | 40 |
| 139. భారత స్వాతంత్రోద్యమం - ముస్లిములు | 142 | 40 |
| 140. భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లిం మహిళలు | 150 | 160 |
| 141. భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లిం యోధులు-1 | 174 | 200 |
| 142. భారత స్వాతంత్ర్యోద్యమం-ముస్లిం ప్రజా పోరాటాలు | 175 | 100 |
| 143. మత సామరస్యం - ఔరంగజేబ్ | 203 | 40 |
| 144. 1857 - ముస్లిములు 1857 | 219 | 150 |
| 145. భారత దేశ సంస్కృతిపై ఇస్లాం, ముస్లింల ప్రభావం | 262 | 35 |
| **మహిళలసాహిత్యం (Women Literature)** | | |
| 146. పరదా ప్రగతికి ప్రతిబంధకమా? | 20 | 15 |
| 147. మహిళలఉపాధి - పరిధులు, అవసరాలు | 165 | 15 |
| 148. మగువలమాటలు | 188 | 30 |
| 149. మర్యం జమీలాతో ఇంటర్వ్యూ | 198 | 15 |
| 150. మహిళలు - మస్జిద్ | 223 | 15 |
| 151. భారత నారి | 226 | 16 |
| 152. ఇస్లామీయ ఉద్యమంలో మహిళలు | 256 | 15 |
| 153. పరదా | 261 | 100 |
| 154. ఇస్లాంలో మహిళలు | 276 | 35 |
| 155. ఇస్లాంలో మగువ | 311 | 70 |
| **కుటుంబజీవితం (Family Life)** | | |
| 156. నికాహ్ ప్రసంగం | 26 | 10 |
| 157. దాంపత్య నియమాలు | 139 | 20 |
| 158. భ్రూణ హత్యలు | 151 | 12 |
| 159. బహుభార్యాత్వం-ఎప్పుడు? ఎందుకు? | 152 | 25 |
| 160. వివాహ సంబంధాలఎంపిక ఎలా చేయాలి? | 153 | 12 |
| 161. ఉమ్మడి కుటుంబం - ఇస్లాం | 154 | 15 |
| 162. వివాహ సంబంధాలు - అసమానతా భావాలు | 155 | 12 |
| 163. తలాఖ్ | 156 | 20 |
| 164. లింగ వివక్ష | 157 | 12 |
| 165. సంతానానికి శిక్షణ | 158 | 15 |
| 166. వివాహాలు - దుబారా ఖర్చులు | 159 | 15 |
| 167. కట్న కానుకలు - వారసులఆస్తిహక్కులు | 164 | 15 |
| 168. లైంగిక సంబంధాలు - ప్రకృతి నియమాలు | 172 | 35 |
| 169. తల్లిదండ్రులు, సంతానం - హక్కులు, బాధ్యతలు | 177 | 25 |
| 170. బాల్య వివాహాలు ఇస్లామ్ | 230 | 12 |
| 171. ఇస్లాంలో భరణం | 243 | 25 |
| 172. ఇస్లాంలో నికాహ్ భావన | 267 | 25 |
| **రమజాన్ (Ramadan Books)** | | |
| 173. రమజాన్ శుభాలకు అర్హులు | 148 | 12 |
| 174. రమజాన్ సత్కార్యాలసమాహారం | 149 | 30 |
| 175. రమజాన్‌కు స్వాగతం | 181 | 25 |
| 176. రమజాన్ ఉపవాసాలు | 186 | 30 |
| 177. ఆధ్యాత్మిక ప్రక్షాళన - రోజా | 306 | 120 |
| **హజ్జ్ (Hajj)** | | |
| 178. హజ్జ్ పరమార్థం | 133 | 10 |
| 179. త్యాగనిరతి | 199 | 10 |
| 180. హజ్జ్ యాత్ర | 238 | 40 |
| **ఆర్థికఅంశాలు (Economical Matters)** | | |
| 181. పెట్టుబడిదారీ, సామ్యవాదం, ఇస్లాం | 61 | 15 |
| 182. మానవుని ఆర్థిక సమస్యలు-ఇస్లామీయ పరిష్కారం | 206 | 30 |
| 183. బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ రంగాలు - ఇస్లాం | 229 | 20 |
| 184. ఆధునిక యుగంలో వడ్డీపై నిషేధం సాధ్యమా? | 257 | 35 |
| 185. వడ్డీ కీడు | 259 | 35 |
| 186. ఆధునిక ఆర్థిక సిద్ధాంతాలు | 8004 | 12 |
| **వివిధఅంశాలపైఇస్లామీయసాహిత్యం (Other Literature)** | | |
| 187. నమాజ్ | 5 | 20 |
| 188. ధర్మపథం | 8 | 15 |
| 189. ముఖ్య హితవులు | 10 | 25 |
| 190. కలిమ-యె-తయ్యిబా అర్థం | 16 | 15 |
| 191. ఈమాన్ వాస్తవికత (ఖుత్బాత్-1) | 17 | 35 |
| 192. ఇస్లాం మరియు అజ్ఞానం | 19 | 20 |
| 193. మతము-రాజకీయం | 29 | 10 |
| 194. ఇస్లాం శిక్షణ | 35 | 40 |
| 195. ఆరాధనలు | 36 | 30 |
| 196. ఇస్లాం రాజకీయ సిద్ధాంతం | 46 | 25 |
| 197. భవబంధాలు మోక్షానికి ప్రతిబంధకాలా? | 47 | 10 |
| 198. సందేహాలు - సమాధానాలు | 49 | 100 |
| 199. జుమా ప్రసంగాలు | 54 | 150 |
| 200. ముస్లిం పర్సనల్ లా | 58 | 35 |
| 201. ఇస్లాం దృష్టిలో మద్య నిషేధం | 64 | 25 |
| 202. ఇస్లాం అపార్థాలమబ్బుల్లో | 65 | 200 |
| 203. నమాజ్ పుస్తకం | 70 | 25 |
| 204. సంకెళ్ళు | 72 | 60 |
| 205. వెన్నెలతెరలు | 74 | 75 |
| 206. ఆరాధనలవాస్తవికత (ఖుత్బాత్-3) | 75 | 35 |
| 207. ఇస్లామీయ జీవన సరళి | 76 | 175 |
| 208. జకాత్ వాస్తవికత (ఖుత్బాత్-4) | 78 | 25 |
| 209. హజ్ వాస్తవికత (ఖుత్బాత్-5) | 79 | 35 |
| 210. మానవ హక్కులు | 82 | 15 |
| 211. దైవదాస్యమే మానవ ఔన్నత్యం | 84 | 15 |
| 212. జాతీయ సమైక్యత | 85 | 10 |
| 213. బైబిల్‌లో ముహమ్మద్ (స) | 88 | 25 |

| పుస్తకం పేరు | బుక్ కోడ్ | వెల |
|---|---|---|
| 214. మానవులు - సమస్యలు | 90 | 40 |
| 215. దైవ మార్గంలో సతత సమరం - జిహాద్ | 93 | 15 |
| 216. టెర్రరిజం - ఇస్లామీయ బోధనలు | 95 | 18 |
| 217. హజ్రత్ సాలెమ్ (రజి) | 97 | 8 |
| 218. ఇస్లాం పరిభాషలో జిహాద్ | 101 | 70 |
| 219. నవయుగం - నవతరం | 102 | 15 |
| 220. రండి! ఈ ప్రపంచాన్ని మార్చేద్దాం | 103 | 25 |
| 221. ఇస్లాం ఉగ్రవాదానికి వ్యతిరేకం | 105 | 30 |
| 222. పరలోక భావన భారతీయ సంప్రదాయాలు | 107 | 25 |
| 223. అమెరికాలో నవముస్లింలవాస్తవ గాథలు | 113 | 15 |
| 224. నిన్ను నీవు తెలుసుకో | 116 | 15 |
| 225. స్వీయ సంస్కరణ | 117 | 15 |
| 226. ధర్మపథంలో అవరోధాలు | 124 | 12 |
| 227. మధురమైన మాటలు | 128 | 10 |
| 228. ఖుర్‌ఆన్ 24 ఆయత్‌లు అభ్యంతరాలు | 129 | 15 |
| 229. తూర్పుతావి | 130 | 30 |
| 230. ఒక మనిషి, రెండు వైఖరులు | 132 | 15 |
| 231. క్యాంపస్ గైడ్ | 134 | 50 |
| 232. తెలుగు అధికార భాష కావాలంటే? | 136 | 40 |
| 233. ప్రపంచ మతాలు - ఇస్లాం | 143 | 50 |
| 234. మేరాజ్ యాత్ర - సందేశం | 144 | 20 |
| 235. ఒడి నుండి సమాధి వరకు | 146 | 25 |
| 236. అంతరిక్ష అధ్యయనం - దివ్య ఖుర్‌ఆన్ | 147 | 150 |
| 237. దిక్సూచి - విజయపథానికి | 160 | 100 |
| 238. జాతి నిర్మాణంలో నైతిక విలువలు | 161 | 15 |
| 239. యదార్థాలఅద్దంలో కామన్ సివిల్ | 163 | 25 |
| 240. దైవ సాన్నిధ్యం కోసం ఏం చేయాలి? | 166 | 10 |
| 241. మహాప్రవక్త సహచరులు - సందేశ సరళి | 167 | 20 |
| 242. ఇస్లామీ ఉద్యమం - కార్యకర్తలు | 170 | 15 |
| 243. ఇస్లాం సుశిక్షణా వ్యవస్థ | 178 | 25 |
| 244. విపులా చ పృథ్వి | 179 | 70 |
| 245. ఉర్దూ సాహిత్యం | 180 | 100 |
| 246. శిక్షణకు తొలి మెట్టు | 183 | 20 |
| 247. విజయానికి ఏకైక మార్గం ఇస్లాం | 184 | 15 |
| 248. సాహిత్యం, వాద వివాదాలు | 187 | 18 |
| 249. మానవ సేవ - దైవదాస్యం | 190 | 15 |
| 250. బర్జఖ్ (పితృలోకం) | 191 | 35 |
| 251. మద్రాసు ప్రసంగం | 193 | 18 |
| 252. ముస్లిం వేడుకోలు | 194 | 50 |
| 253. పరిస్థితులు - మన బాధ్యతలు | 196 | 12 |
| 254. సందేశ ప్రచార ఉపాయం | 201 | 100 |
| 255. ఇస్లాం వెలుగులో సామాజిక న్యాయం | 204 | 12 |
| 256. దైవప్రవక్త (స) సందేశసరళి - మన బాధ్యతలు | 205 | 25 |
| 257. ఇస్లాంలో బహుదైవారాధన లేదు | 207 | 20 |
| 258. ఇస్లాంపై విమర్శలు, జవాబులు | 209 | 60 |
| 259. నెలవంక | 210 | 86 |
| 260. మరణం నుండి మట్టిపాలయ్యేదాక | 213 | 20 |
| 261. కందక సంకేతాలు | 215 | 40 |
| 262. ధర్మప్రవేశంలో నిర్బంధం లేదు | 220 | 25 |
| 263. ఇస్లాం మార్గం | 224 | 100 |
| 264. మహావృక్షాలు (మౌలానా మౌదూది గృహస్థ జీవితం) | 225 | 30 |
| 265. ఇస్లాం సందేశం - నియమ నిబంధనలు | 227 | 15 |
| 266. ఇస్లాం పిలుపు | 228 | 120 |
| 267. సందేశ కార్యకలాపాలకు మార్గదర్శక సూత్రాలు | 231 | 30 |
| 268. 99 పవిత్రమైన అల్లాహ్ పేర్లు | 232 | 85 |
| 269. ఇస్లాం ఆవశ్యకత | 240 | 40 |
| 270. ప్రియమైన మీకు | 241 | 20 |
| 271. సత్యధర్మంలో సమతాభావం | 244 | 60 |
| 272. సక్సెస్ సూక్తులు | 245 | 30 |

| పుస్తకం పేరు | బుక్ కోడ్ | వెల |
|---|---|---|
| 273. పూలరెమ్మ | 247 | 30 |
| 274. ఉద్యమంలో స్తబ్దత | 249 | 50 |
| 275. ఇస్లాం ప్రాముఖ్యత - హిందూ ధర్మం దృష్ట్యా | 250 | 20 |
| 276. ఒక చిన్న మాట | 251 | 12 |
| 277. యువత సమస్యలు - పరిష్కారాలు | 252 | 100 |
| 278. విశ్వాస మాధుర్యం | 254 | 35 |
| 279. ధర్మసంస్థాపనం మన బాధ్యత | 264 | 70 |
| 280. బహుదూరపు బాటసారి | 266 | 30 |
| 281. మానవ హక్కుల రక్షణ- ఇస్లాం | 270 | 90 |
| 282. అనుబంధాలు | 271 | 90 |
| 283. ఇస్లాం ఉగ్రవాదమా? ఆదర్శవాదమా? | 273 | 70 |
| 284. ఇస్లాం సంస్కృతీ సౌరభాలు | 274 | 100 |
| 285. సత్యాన్ని తెలుసుకో | 275 | 20 |
| 286. యేసుక్రీస్తు ఈసా (అలై) అందించిన శుభవార్త | 277 | 30 |
| 287. స్త్రీ పురుష సమానత్వం | 282 | 30 |
| 288. ఇస్లామీయ సంస్కృతి | 283 | 15 |
| 289. ఇస్లామీయ వ్యక్తిత్వం | 289 | 200 |
| 290. **Sang-e-Meel (Urdu)** | 290 | 200 |
| 291. ఇస్లామేతర రాజ్యం- ముస్లిములు | 291 | 50 |
| 292. శ్రేష్ఠసమాజం గమనం-గమ్యం | 299 | 50 |
| 293. షిర్క్ వాస్తవికత | 304 | 120 |
| 294. మనిషీ! నీ సృష్టికర్తను తెలుసుకో! | 305 | 100 |
| 295. మారూఫ్ వ మున్కర్ | 307 | 200 |
| 296. ఇస్లామీ ధర్మావగాహన | 1210 | 130 |
| 297. ముస్లిం పర్సనల్ లా నైతిక & న్యాయ సమస్యలు | | |
| ముస్లిం మహిళల సమస్యలు - పరిష్కారాలు | ---- | 30 |
| 298. ఆలోచించడం నేరం కాదు | 309 | 70 |
| 300. అందరి ప్రవక్త ముహమ్మద్ | 310 | 30 |
| 301. ఇస్లాంలో మగువ | 311 | 70 |
| 302. ఇస్లాం ప్రబోధిని (నర్సరీ) | 312 | 35 |
| 303. ఇస్లాం ప్రబోధిని (జూనియర్ కె.జి) | 313 | 35 |
| 304 ఇస్లాం ప్రబోధిని (సీనియర్ కె.జి) | 314 | 35 |
| 305 ఇస్లాం ప్రబోధిని (1వ తరగతి) | 315 | 35 |
| 306 ఇస్లాం ప్రబోధిని (2వ తరగతి) | 316 | 35 |
| 307 ఖుర్‌ఆన్ వైశిష్ట్యాలు | 317 | 60 |
| 318 రండి! నిజ ఆరాధ్య దైవాన్ని కలుసుకోండి! | 318 | 120 |
| 319 ఆలోచనలు | 319 | 200 |
| 320 విశ్వాసుల మాతృమూర్తి సయ్యిదా ఖదీజా (ర.అ) | 320 | 480 |
| 321 ఖుర్‌ఆన్ అవగాహనం (9వ సంపుటి) | 321 | 400 |
| 322 Islamiyat (**Nursery)** | 322 | 30 |
| 323 Islamiyat (Junior K.G.) | 323 | 35 |
| 324 Islamiyat (Senior K.G.) | 324 | 35 |
| 325 Islamiyat (Class - 1) | 325 | 50 |
| 326 Islamiyat (Class - 2) | 326 | 50 |
| 327 ఇస్లాం ప్రాథమిక శిక్షణ | 327 | 40 |
| 328 ఇస్లాం కే బునియాది తాలీమ్ (ఉర్దూ) | 328 | 40 |
| 329 ఉజ్వల తారలు | 329 | 300 |
| 330 తెలుగు వర్ణమాల | 330 | 150 |
| 331 భాషణ | 331 | 100 |
| 332 ఎంత అద్భుతం ఈ ఖుర్‌ఆన్ | 332 | 50 |
| **333 విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (ర.అ.)** | **333** | **300** |

**Bank Details: TELUGU ISLAMIC PUBLICATIONS TRUST,**
Central Bank of India, Noorkhan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407**

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:**

**✆ 9700255736 7660012481**




## శాంతికి భంగం కలిగించే వారికి ఓటు వేయకండి

పర్యాటకుల నగరమైన యుపిలో శాంతికి విఘాతం కలిగించాలనుకునే కొన్ని శక్తులను ప్రోత్సహించవద్దని భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు) రైతు నేత రాకేష్ తికాయత్ ప్రజలను హెచ్చరించారు. మథురాను ముజఫ్ఫర్ నగర్‌గా మార్చకుండా చూడాలని సూచించారు. శాంతియుతంగా ప్రార్థనలు చేయాలనుకున్నా, సాధారణ జీవనం సాగించాలనుకున్నా శాంతికి భంగం కలిగించే వారికి ఓట్లు వేయకూడదని వ్యాఖ్యానించారు. పరోక్షంగా బిజెపికి ఓట్లు వేయవద్దంటూ ప్రజలను హెచ్చరించారు. బిజెపి మాయలో పడవద్దని, ఉపాధి అవకాశాలు దెబ్బ తింటాయని, మథుర అల్లకల్లోలంగా మారడంతో పాటు అధికశాతం మంది నిరుద్యోగులుగా మారతారని అన్నారు.

## అనారోగ్యమంటూ బెయిల్... కానీ!

ఆమె ఒక ఎంపీ. ఒక కేసు విషయంలో అరెస్టయి జైలుకు వెళ్ళారు. కాని అనారోగ్యమంటూ బెయిల్‌పై విడుదలయ్యారు. కాని ఆమె ఇటీవల క్రికెట్ ఆడుతూ మీడియా కంట పడ్డారు. దీంతో కొన్ని సందేహాలు రేకెత్తుతున్నాయి. అనారోగ్యమని బయటికి వచ్చిన ఆమె బీజేపీ ఎంపీ. పేరు ప్రజ్ఞాసింగ్ ఠాకూరు. అనారోగ్యం కారణాలు చూపుతూ విడుదలైన ఆమె ఇలా క్రికెట్ ఆడటం ఏంటని విపక్షాలు మండిపడుతున్నాయి. ఇప్పుడే కాదు గతంలోనూ ఆమె ఒక సందర్భంగా గర్భా డ్యాన్స్ చేయడమూ విమర్శలకు తావిచ్చింది. 2008 మాలెగావ్ పేలుళ్ళ కేసులో ఆమె అరెస్టయ్యారు. అయితే అనారోగ్య కారణాలతో 2017లో బెయిల్‌పై విడుదలయ్యారు.

## 18 ఏళ్ళు నిండిన యువతుల వివాహంలో ఎలాంటి అవరోధం లేదు

అమ్మాయిల వివాహం విషయంలో 21 ఏళ్ళ వయసు చట్టం దేశంలో ఇంకా అమలు కాలేదని కనుక ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అన్నారు తెలంగాణ వక్ఫ్ బోర్డు అధ్యక్షులు ముహమ్మద్ సలీమ్. నలుమూలల నుంచి 18 ఏళ్ళు నిండిన అమ్మాయిల పెళ్ళి చేయాలా వద్దా అనే సందేహాలు నిరంతరం చాలా జిల్లాల నుంచి వస్తున్నాయని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం నిశ్చయమైన వివాహాలు కూడా జరపాలా వద్దా అనే సందేహాలు ప్రజలు అడుగున్నారని ఆయన అన్నారు. ఈ బిల్లు ప్రస్తుతం పార్లమెంటులో ఆమోదం పొంది సెలక్ట్ కమిటీకి వెళ్ళింది. దాన్ని పూర్తిగా సమీక్షించిన తరువాత అది ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. ఆ తరువాత తిరిగి పార్లమెంటుకు ఆమోదం కోసం వస్తుంది. ఉభయ సభలలో బిల్లు ఆమోదం పొందిన తరువాత రాష్ట్రపతి ఆమోదం కూడా పొందాల్సి ఉంటుంది. ఆ తరువాత గెజిట్ జారీ అవుతుంది. ఇదంతా సుదీర్ఘ ప్రక్రియ. అప్పటి వరకు అమ్మాయిల వివాహ వయసు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఖాజీలు ప్రజలకు ఈ విషయం పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు.

## పలు రైల్వేస్టేషన్ల పేర్లు మార్పు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలు రైల్వేస్టేషన్ల పేర్లను మారుస్తూ యూపీ సర్కారు చర్యలు తీసుకుంది. ఝాన్సీ రైల్వేస్టేషన్ పేరును వీరాంగణ లక్ష్మీబాయి రైల్వేస్టేషనుగా మారుస్తూ యూపీ సర్కారు పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోదించింది. గతంలో మొగల్ సరాయ్ రైల్వేస్టేషన్ పేరును పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ రైల్వేస్టేషనుగా మార్చారు. అలహాబాద్ పేరును ప్రయాగరాజ్ అని మార్చారు. దీంతోపాటు యూపీలోని సుల్తాన్ పూర్, మీర్జాపూర్, అలీఘడ్, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, ఘాజీపూర్, బస్తీపూర్ రైల్వేస్టేషన్ల పేర్లను కూడా మార్చాలని యూపీ ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఏ రాష్ట్రంలో లేని విధంగా యూపీలో యోగి సర్కారు పలు రైల్వేస్టేషన్ల పురాతన పేర్లను మార్చాలని నిర్ణయించింది. అభివృద్ధిని వదిలి రైల్వేస్టేషన్ల పేర్ల మార్పుకే యూపీ సర్కారు ప్రాధాన్యం ఇస్తుందని పలువురు విమర్శిస్తున్నారు.

## ఆ విద్వేష ప్రసంగాలను సుమోటాగా తీసుకోవాలి..

ఇటీవల ఢిల్లీ, హరిద్వార్‌ల్లో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో వక్తలు చేసిన విద్వేష ప్రసంగాలను సుప్రీంకోర్టు సుమోటోగా పరిగణనలోకి తీసుకోవాలని 76 మంది న్యాయవాదులు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణను కోరారు. ఈ మేరకు వారు ఒక లేఖ రాశారు. ఆ సమావేశాల్లో వారు చేసింది కేవలం విద్వేషాన్ని రెచ్చగొట్టేలా ప్రసంగించడమే కాదని, మొత్తంగా మైనారిటీ కమ్యూనిటీని హత్య చేయాలని బహిరంగంగానే పిలుపిచ్చారని ఆ లేఖ పేర్కొంది. ఆ ప్రసంగాల వల్ల దేశ ఐక్యత, సమగ్రతకు ముప్పు పొంచి వుందని, అంతేకాదు, లక్షలాది మంది ముస్లిం పౌరుల ప్రాణాలకు కూడా ప్రమాదముందని లేఖ పేర్కొంది. గతంలో కూడా ఇలాంటి ప్రసంగాలు చేశారని, అందువల్ల తక్షణమే సుప్రీం కోర్టు ఇందులో జోక్యం చేసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని న్యాయవాదులు కోరారు. సల్మాన్ ఖుర్షీద్, దుశ్యంత్ దేవ్, మీనాక్షి అరోరా ప్రభృతులు ఈ లేఖపై సంతకాలు చేశారు.




## భారత్-సౌదీ మధ్య నేరుగా విమానాలు

భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లాలనుకునేవారికి శుభవార్త. విమానాల రాకపోకలు కొనసాగించడానికి భారత్, సౌదీ ప్రభుత్వాలు తాత్కాలిక ఒప్పందం చేసుకున్నాయి. దీన్ని అనుసరించి జనవరి 1 నుంచి రెండు దేశాల మధ్య ప్యాసింజర్ విమానాలు తిరగనున్నాయి. కరోనా నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలపై ఆంక్షలు ఉండటంతో ప్రస్తుతం సౌదీకి నేరుగా విమానాలు లేవు. ఇతర గల్ఫ్ దేశాలకు వెళ్లి, అక్కడ నుంచి సౌదీకి చేరుకుంటున్నారు. సౌదీ నుంచి భారత్‌కు రావాలన్నా ఇదే పరిస్థితి. తాజా ఒప్పందంతో 1 నుంచి నేరుగా సౌదీకి వెళ్లడం వీలవుతుంది.

## ఒమన్ కీలక నిర్ణయం!

ఒమన్ వలసదారుల నియామకాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ సంస్థలకు ప్రవాస కార్మికులను నియమించుకునేందుకు గడువును పొడిగించింది. ఈ మేరకు ఆ దేశ కార్మిక శాఖ కీలక ప్రకటన చేసింది. డిసెంబర్ 31తో ముగియనున్న గడువును తాజాగా 2022 మార్చి 31 వరకు పొడిగించింది. "ప్రైవేట్ సెక్టార్‌లోని కంపెనీలు విదేశీయులను నియమించుకునేందుకు గడువును పొడిగిస్తున్నాం. దానికి సంబంధించిన లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకునేందుకు 2022 మార్చి 31 వరకు అవకాశం కల్పించాం" అని మినిస్ట్రీ ఆఫ్ లేబర్ తెలిపింది. కార్మికశాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై అక్కడి ప్రైవేట్ రంగ సంస్థలు, వలసదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రధానిని సస్పెండ్ చేసిన సోమాలియా అధ్యక్షుడు

సోమాలియా ప్రధాన మంత్రి ముహమ్మద్ హుస్సేన్‌ను సస్పెండ్ చేసినట్లు ఆ దేశాధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్లాహ్ ముహమ్మద్ ప్రకటించారు. ప్రధానమంత్రిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ పూర్తయ్యే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపారు. ప్రధాన మంత్రి ముహమ్మద్ హుస్సేన్ తనపై వచ్చిన భూ కబ్జా ఆరోపణలపై దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారు. ఈ దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆయన అధికారాలను నిలిపేయాలని దేశాధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్లాహ్ ముహమ్మద్ నిర్ణయించారని దేశాధ్యక్షుని కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

## అఫ్ఘాన్‌లో ఎన్నికల కమిషన్ రద్దు

అఫ్ఘానిస్తాన్ ఎన్నికల కమిషన్‌ను తాలిబన్ల ప్రభుత్వం రద్దు చేసింది. స్వతంత్ర ఎన్నికల కమిషన్, ఎన్నికల ఫిర్యాదుల కమిషన్‌ను రద్దు చేస్తున్నట్లు తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి (డిప్యూటీ) బిలాల్ కరీమి వెల్లడించారు. భవిష్యత్తులో అవసరమైతే వీటిని పునరుద్ధరిస్తాం అని తెలిపారు. అలాగే పార్లమెంటరీ వ్యవహారాల శాఖను మూసివేస్తున్నట్లు బిలాల్ పేర్కొన్నారు.

## ముహమ్మద్ షారిఖ్‌కు కింగ్ ఫైసల్ అవార్డు




కువైట్ పారిశ్రామికవేత్త ముహమ్మద్ షారిఖ్‌కు కింగ్ ఫైసల్ అవార్డు వరించింది. రియాద్‌లో కింగ్ ఫైసల్ అవార్డు 2021 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇస్లామ్ ప్రపంచంలో అందజేస్తున్న అత్యున్నత పురస్కారం ఇది. ఇస్లామీయ విద్య, అరబీ భాష, వైద్యం, సైన్స్, ఇస్లామీ సేవ తదితర రంగాలలో విశేష సేవలు అందించిన వారికి ఈ అత్యున్నత పురస్కారం అందజేస్తారు. ఇస్లామీయ సేవలకు గాను కువైట్ పారిశ్రామిక వేత్త ముహమ్మద్ షారిఖ్‌కు ఈ పురస్కారం అందజేశారు. ఈయన సఖర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వ్యవస్థాపకులు. తన కంపెనీ కోసం తొలిసారిగా అరబీ భాషలో ఆపరేటింగ్ సిస్టమ్ తయారు చేశారు. ఖుర్ఆన్ మరియు హదీసుల ఆంగ్ల అనువాదం కోసం ప్రథమంగా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. అందుకుగాను ఆయనకు ఈ పురస్కారం లభించింది.

## ఇజ్రాయిల్‌లో పాలస్తీనా నేత పర్యటన

11 ఏళ్ళ తర్వాత మొదటిసారిగా పాలస్తీనా అధ్యక్షుడు ముహ్మద్ అబ్బాస్ ఇజ్రాయిల్‌లో పర్యటించారు. ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్ళిన అబ్బాస్ తొలుత ఇజ్రాయిల్ రక్షణ మంత్రితో చర్చలు జరిపారు. సెంట్రల్ ఇజ్రాయిల్‌లో రక్షణ మంత్రి బెన్నీ గంట్జ్ నివాసంలో సమావేశం జరిగినట్లు పాలస్తీనా సీనియర్ అధికారి తెలిపారు. 2010 తర్వాత మొదటిసారిగా ఇజ్రాయిల్ అధికారితో అబ్బాస్ సమావేశమయ్యారని చెప్పారు. విశ్వాస పునరుద్ధరణ చర్యలను మరింత ముందుకు తీసుకెళ్ళాలన్నది తమ అభిమతమని చెప్పారు. అలాగే భద్రతా సమన్వయాన్ని కూడా మెరుగుపరచాలని భావిస్తున్నామన్నారు.




**మానవ** జీవితం చాలా అమూల్యమైనది. అందమైనదీ, అపురూపమైనది. అది ఎప్పుడు, ఎక్కడ, ఎలా ముగిసితుందో ఎవరికీ తెలియదు. అదొక దైవ రహస్యం. దాన్ని ఛేదించే శక్తి దైవం ఎవ్వరికీ ప్రసాదించలేదు. జీవితకాలాన్ని సద్వినియోగం చేసుకోవడం పైన్నే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో మనం ఏదైనా సాధించవచ్చు.. ఛేదించవచ్చు. డబ్బు.., గౌరవం.., ఉద్యోగం.., అధికారం.., హోదా.. ఏదైనా కావచ్చు, అది సాధ్యమే.. కాని కాలాన్ని మాత్రం ఎంత ధనం ధారపోసినా, ఎంత పలుకుబడి ఉపయోగించినా సాధించలేము. గడిచిన కాలం - అది రెప్ప పాటైనా సరే - కోట్లు కుమ్మరించినా మనకు లభించదు. ఇది కాలం చెప్పే సత్యం.

మనం దాని విలువను గుర్తించకపోతే అది మన కోసం ఆగదు. గోడకు అమర్చిన గడియారం ముల్లు 'టిక్ టిక్'మని శబ్దం చేస్తూ తన పని అది చేస్తూనే ఉంటుంది. సమయాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోగలిగినప్పుడే అది మనకు ఉపకరిస్తుంది. లేకపోతే అది మనల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి ముందుకు సాగిపో తుంది. అందుకని మనం ఏ విషయంలో అయినా సకాలంలో స్పందించగలగాలి. సమయం మించిపోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మనకోసం నిరీక్షిస్తూ ఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మన వద్దకు రావాలని ఆశించడం కరెక్ట్ కాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని ఎంత మాత్రం దరిచేరనీయకూడదు.

ఎందుకంటే, ఈ రోజు చేయవలసిన కార్యాన్ని రేపటికి వాయిదా వేశామంటే కాలం విలువను మనం గుర్తించనట్లే లెక్క. ఈనాటి కొద్దిపాటి అలక్ష్యం రేపటి బాధ్యతను రెట్టింపు చేస్తుంది. ఒకటికి రెండు తోడై, బాధ్యతలు పేరుకు పోతాయి. ఇక ఆ తరువాత బాధ్యతల నిర్వహణ తలకు మించిన భారంగా పరిణమించి, పలాయనవాదాన్ని ఆశ్రయించే దుస్థితికి తీసుకువెళుతుంది. అద్భుతమైన విజయాలను సాధించినవారి జీవితాలను పరిశీలిస్తే, వారు కాలాన్ని (సమయాన్ని) ఎలా తమకు అనుకూలంగా మలచుకొని, సద్వినియోగం చేసుకొని, కొత్త అవకాశాలను సృష్టించుకున్నారో, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ఎలా నాంది పలికారో మనకు అర్థమవుతుంది.

ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ తన జీవితకాలంలో వెయ్యికంటే ఎక్కువ నూతన ఆవిష్కరణలకు నాంది పలికాడు. వాటిలో గ్రామ్ ఫోన్, విద్యుత్తు బల్బు అతని ఆవిష్కరణలే అని మనందరికీ తెలుసు. ఇది ఎలాసాధ్యమైంది? అతను కాలం నాడిని ఒడిసిపట్టి, దాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కాలక్షేపం కోసం కాలాన్ని దుర్వినియోగం చేయలేదు. సరదాలు, షికార్లు, సొల్లు కబుర్ల కోసం సమయాన్ని నిర్లక్ష్యం చేయలేదు. నేటి యువతకులాగా స్మార్ట్ ఫోనుకే అతుక్కుపోయి, ఫేస్ బుక్కు, వాట్సాపు చాటింగుల్లో సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లుగా, ఆనాడతను సమయాన్ని దుర్వినియోగం చెయ్యలేదు. తన ప్రయోగశాలనే అతను వినోదశాలగా మార్చుకున్నాడు. చేస్తున్న పనిలోనే ఆనందాన్ని, వినోదాన్ని అనుభవించాడు. కాలం విలువను గుర్తించబట్టే, విద్యుత్ బల్బును కనుగొనే సమయంలో ఏకధాటిగా పన్నెండు, పదమూడు రోజులు ప్రయోగశాలలోనే నిద్రలేని రాత్రులు గడిపాడు. అనుకున్నది సాధించాడు.

అందుకని కాలం విలువను గుర్తించాలి. దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకొని విజయ తీరాలకు చేరినవారి గాథల్ని అధ్యయనం చెయ్యాలి. స్ఫూర్తి పొందాలి. అపజయాలు మూటగట్టుకొని కాలగతిలో కలిసిపోయిన వారి గాథల్ని గుణపాఠాలుగా తీసుకోవాలి. కాలం/సమయం మనకు అనేక నిజాలు చెబుతోంది. వినడానికి, అర్థం చేసుకోడానికి, ఆచరించడానికి సిద్ధంగా ఉండాలి. బుద్ధిజీవి అయిన మానవుడు ఈ విషయాలన్నీ అవలోకనం చేసుకుంటూ, నీతిగా, నిజాయితీగా, విలువలతో కూడిన జీవితం గడుపుతూ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు. గమ్యాన్ని ముద్దాడవచ్చు.

కనుక గత సంవత్సరం నుండి గుణ పాఠాలు నేర్చుకుంటూ, నూతన సంవత్సరంలో నూతనోత్సాహంతో ముందుకు సాగిపోదాం.. ఏమంటారు?

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**